


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

14.08.2026

శుక్రవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 93

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# దేశంలోనే నంబర్ వన్ రాజధానిగా అమరావతి

- ఇది ప్రారంభం మాత్రమే..
- సీఎం చంద్రబాబు సంచలన కామెంట్లు
- అమరావతి అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమైంది
- అమరావతి అభివృద్ధిపై ఆలోచించాలి
- రాబోయే రోజుల్లో రాజధాని నిర్మాణం అన్‌స్టాపబుల్
- 96 కి.మీ. ఇన్నర్ రింగ్ రోడ్డు.. 190 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డు



2లో..

**అమరావతి, ఆగస్ట్ 13, అనంతనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమైందని, భవిష్యత్తులో దేశంలోనే నంబర్ వన్ రాజధానిగా అమరావతి నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా అమరావతి అభివృద్ధిపై ఆలోచించాలని, రాబోయే రోజుల్లో రాజధాని నిర్మాణం అన్‌స్టాపబుల్‌గా కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజధాని అమరావతిని అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ3ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

**96 కి.మీ. ఇన్నర్ రింగ్ రోడ్డు.. 190 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డు**

అమరావతి చుట్టూ 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు, 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం కూడా ఆమోదం తెలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పనులను ప్రారంభించారని, 2028లో భారతదేశం మెచ్చే అమరావతి ప్రారంభోత్సవానికి ప్రధాని మళ్లీ వస్తారని పేర్కొన్నారు. ఇక, అమరావతి వాస్తు పరంగా కూడా అద్భుతమైన ప్రాంతమని చంద్రబాబు అన్నారు. స్పీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తయిన తర్వాత అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణం ఒకవైపు వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**అమరావతి ఉద్యమంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర**

గతంలో వైసీపీ నాయకులు రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడ్డారని చంద్రబాబు విమర్శించారు. అమరావతి రాజధాని ఉద్యమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా మద్దతుగా పోరాడారని గుర్తు చేశారు. ముళ్లకంపలను సైతం లెక్కచేయకుండా రైతులకు అండగా పవన్ నిలిచారని పేర్కొన్నారు. తన భార్య చేతి గాజులను కూడా అమరావతి కోసం విరాళంగా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు.



# విచారణ జరగాలి

- యూనిటీ మాల్ ఒప్పందంపై
- ఎంపీ రఘునందన్ రావు
- తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయి



2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం

ఫుడ్ ఐటమ్స్ లేబులింగ్‌పై.. మీరు చేయలేకపోతే, మేమే చేస్తాం

2లో..



## బాదల్‌పై హత్యాయత్నం

- అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్
- నాందేడ్ గురుద్వారాలో ఘటన
- కత్తితో దాడిచేసిన యువకుడు

**నాందేడ్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

అకాలీ దళ్ అధినేత, పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురువారం దాడి జరిగింది. గురుద్వారాలో ఆయనపై నిహంగ్ సిక్కు కిర్పాన్‌తో దాడిచేసినట్టు వర్గాలు తెలిపాయి. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు.. బాదల్‌ను చికిత్స కోసం నాందేడ్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

2లో..

# రాజకీయ దురుద్దేశ్యం లేదు

- అది నిరూపిస్తే రాజకీయం వదిలేస్తా
- పోచారం శ్రీనివాసరెడ్డి సవాల్



2లో..

**నిజామాబాద్, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్**

ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశ్యం లేదని.. బుద్ధిహీనులు నాకు స్వార్థం ఉందని మాట్లాడుతున్నారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. గురువారం కామారెడ్డి జిల్లా వర్ని మండలంలో పర్యటించి, జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తనకు స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటానన్నారు. "నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం. అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రికి మద్దతు తెలిపాను.

# మరణాలను 70 % వరకు తగ్గించగలిగాం

- ఏనుగుల వల్ల జరిగే మృతులు
- ఏనుగులు.. అడవుల సంరక్షణకు..
- జీవవైవిధ్యానికి కాపలాదారులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్




**విశాఖపట్నం, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

ఏనుగులు.. అడవుల సంరక్షణ, జీవవైవిధ్యానికి కాపలాదారులు, దేశ వారసత్వానికి ప్రతీకలు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖలోని గురువారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగింది. 150 ఏనుగుల కారిడార్లు గుర్తించి రక్షణ కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 132 142 అడవి ఏనుగులు ఉన్నాయి.

6లో..

## భూ కేటాయింపులపై బీఆర్ఎస్ రాజకీయం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- టెస్సరాక్ట్ సంస్థ భూముల వ్యవహారం
- బీఆర్ఎస్ హయాంలో..
- 54 కంపెనీలకు భూ కేటాయింపులు

2లో..

## హిందూ, ముస్లింలు

# నా రెండు కళ్లు

- కేవలం మాటల్లో కాదు.. చేతల్లో చూపించామన్న సీఎం రేవంత్
- మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది
- 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'కు హాజరు
- మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోంది
- గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో..
- మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారు

6లో..



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

**హైదరాబాద్ కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటివారని, మాటల్లో కాకుండా చేతల్లో సోనియా గాంధీ ఆ రీతిగా నిరూపించారని తెలిపారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేస్తూ, తెలంగాణలో అధికారంలోకి వస్తే ఆ రిజర్వేషన్లను తొలగిస్తామన్న అమిత్ షా సవాల్‌కు గుజరాత్‌లో ముందు తొలగించి చూపించాలని ఆరోపించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోందని, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారని స్పష్టం చేశారు.**

గతంలో గ్రూప్ 1 ప్రశ్నపత్రాలు పల్లీ బఠానీల్లా అమ్ముడయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత లేని వారిని నియమించారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యూపీఎస్సీని అధ్యయనం చేసి రిటైర్డ్ డీజీపీని చైర్మన్‌గా నియమించామని చెప్పారు. అభ్యర్థుల ఉద్యోగాల నియామకాన్ని అడ్డుకోవడానికి కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, మంచి అడ్వకేట్లతో పోరాడి అభ్యర్థుల తరఫున నిలబడి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మైనారిటీ సభ్యుడిని నియమించడమే కాకుండా, అజారుద్దీన్‌కు మంత్రి పదవి, నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగం సిరాజ్‌కు నిబంధనలు సవరించి డీఎస్పీ ఉద్యోగాన్ని అందించామన్నారు.

# ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలి

- స్పీకర్ అయ్యన్న పాత్రుడు
- రాజకీయాల్లోకి రావాలనుకునే వారు..
- లక్ష్మీనారాయణను చూసి చాలా నేర్చుకోవాలి

2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు కన్నా లక్ష్మీనారాయణను చూసి చాలా నేర్చుకోవాలని సూచించారు. గురువారం గుంటూరు జిల్లా వేదికగా మీడియాతో అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ఇప్పుడు జనం ఓసారి ఓటేస్తే.. రెండోసారి ఓటేయటం లేదని అన్నారు.

## గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

- సీఎం చంద్రబాబుపై జగన్ మండిపాటు
- బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితి
- ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం

2లో..

**అమరావతి, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాజకీయ దురుద్దేశ్యం లేదు



(మొదటి పేజీ తరువాయి)

అన్నం పెట్టిన వాళ్లను మర్చిపోతే పుట్టగతులుండవు. కేసీఆర్ చేసిందు కాబట్టే చేసిందు అని చెప్పాను. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతాను. ఉన్నది ఉన్నట్లు చెప్పడం నా నైజం. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయను. నా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తాను. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలి. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేం." అని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ వద్దకు వెళ్లి కండువా కప్పుకొన్నట్లు ఇటీవల మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. సగం నిధులు మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం ఈ వ్యాఖ్యలు చేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల గుత్తేదారులు పనులు ఆపేశారని.. నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ నిర్వహించారమన్నారు. ఆ సమావేశంలో సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించినట్లు తెలిపారు. సీఎం చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి నిధులు మంజూరు చేయలేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఈ వ్యాక్యలపై ఒక్కసారిగా రాజకీయ దుమారం రేగింది. దీంతో మరోసారి ఈ వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు.

# విచారణ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు.

యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.




# గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగుతుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడకపోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు.

ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం

- అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు..
- ఆహార పదార్థాలపై తప్పనసరిగా హెచ్చరికలు చేయాలి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 13, అనంతజనశక్తి న్యూస్

ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం అల్టిమేటం ఇచ్చింది. అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు కలిగిన ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లను 'మీరు చేయలేకపోతే.. మేము చేస్తామని' సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో కేంద్రం, భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు ఏమైనా కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి లొంగిపోతున్నారా? అని నిలదీసింది.

**కార్పొరేట్ ఒత్తిడికి ప్రభావితం**

"ఈ అంశం పౌరులు ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లల ఆరోగ్యానికి సంబంధించింది. దీనిపై తీసుకునే నిర్ణయాలు కార్పొరేట్ ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదు" అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా FSSAI తీరును ధర్మాసనం తప్పుపట్టింది. ఆహార రంగ పరిశ్రమ ఈ లేబుళ్లను వ్యతిరేకిస్తోందని FSSAI చేసిన వాదనలను పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మార్చి 7న జరిగిన FSSAI సమావేశం మినిట్స్‌ను పిటిషనర్ తరఫు లాయర్ ప్రస్తావిస్తూ.. అందులో తీసుకున్న నిర్ణయాలు కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లను ఆహార పరిశ్రమ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ.. దానికి బదులుగా రోజువారీకి అవసరమైన చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు పరిమాణాన్ని తెలియజేసే పట్టిక రూపంలో ఇవ్వాలని FSSAI ప్రతిపాదించింది. అయితే, FSSAI తన అఫిడవిట్‌లో కేవలం ఆహార పరిశ్రమ వ్యతిరేకతను మాత్రమే పేర్కొందని, చక్కెర, ఉప్పు, కొవ్వులు ఎక్కువ ఉన్న ఆహారాల వినియోగాన్ని తగ్గించడానికి హెచ్చరిక లేబుళ్లు ఎంత అవసరమో పౌర సమాజం ప్రతినిధులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా విస్మరించిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రభుత్వం సిద్ధంగా లేదా?**

దీనికి స్పందించిన ధర్మాసనం.. ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా లేదా? అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్‌ను సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, తమ ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయని పునరుద్ఘాటించింది. బడా కార్పొరేట్ సంస్థల నుంచి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని, దానికి 'తలొగ్గుతోందని' వ్యాఖ్యానించింది.

కేవలం ప్రజా ప్రయోజనాల కోసమే తాము ఈ చర్యలు తీసుకుంటున్నామని ధర్మాసనం పేర్కొంది. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని, ఇప్పటివరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని నిలదీసింది. 'ప్రభుత్వమే స్వయంగా ఈ పని చేస్తుందా, లేక మేమే ఉత్తర్వులు జారీ చేయాలా?' అని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను వివరించడానికి అనుమతించాలని అదనపు సొలిసిటర్ జనరల్ కోరగా... తమ ఆదేశాలను ప్రభుత్వం అమలు చేసి తీరాల్సిందేనని తేల్చిచెప్పింది. 'మీరు చేయలేకపోతే, మేమే తగిన ఉత్తర్వులు ఇస్తాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**రెడ్ వార్నింగ్ మార్కులు**

సాంప్రదాయ భారతీయ ఆహార పదార్థాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఈ ప్రతిపాదిత నిబంధనల వల్ల నామ్‌కీన్ వంటి అనేక ఉత్పత్తులపై 'రెడ్ వార్నింగ్ మార్కులు' వచ్చే అవకాశం ఉందని కేంద్రం వాదించింది. అభివృద్ధి చెందిన దేశాల్లోని ఆహార పదార్థాల్లో ఉప్పు, చక్కెర, కొవ్వు స్థాయిలు తక్కువగా ఉంటాయని, కాబట్టి ఆ ప్రమాణాలను నేరుగా భారతీయ సాంప్రదాయ ఆహారాలకు వర్తింపజేయడం సరికాదని ASG వాదించారు.

అభివృద్ధి చెందిన దేశాలు పాటించే అంతర్జాతీయ ప్యాకేజింగ్ ప్రమాణాలను భారత్ పాటించడం కష్టమన్న కేంద్రం వాదనను నిరాకరిస్తూ "భారత్ ఎప్పటికీ అభివృద్ధి చెందని దేశంగానే ఉండిపోవాలా?' అని కోర్టు ప్రశ్నించింది. దేశ ప్రజల, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వానికి ఇష్టం లేదా అని నిలదీసింది.



# బాదల్‌పై హత్యాయత్నం



(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసిన వ్యక్తిని నిహంగ్ సిక్కు అయిన జస్పాల్ సింగ్‌గా గుర్తించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. దాడి చేసిన వ్యక్తి గత రెండేళ్లుగా ఆ గురుద్వారాలో పనిచేస్తున్నాడు. దాడి అనంతరం బయటకు వచ్చిన వీడియోలో, బాదల్ తన కుడి చేతికి కాషాయ వస్త్రాన్ని చుట్టుకుని నడుస్తూ కనిపించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. దాడి చేసిన వ్యక్తి సుఖ్‌బీర్ బాదల్‌ను కడుపులో కత్తితో పొడవడానికి ప్రయత్నించాడు.. కానీ భద్రతా సిబ్బంది అతడ్ని అడ్డుకోవడంతో చేతికి గాయమైంది. బాదల్‌కు ప్రాణాపాయం లేదని అకాలీ దళ్ వర్గాలు తెలిపాయి. నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, బాదల్ చేతికి కుట్లు పడ్డాయని తెలిపారు.

దాడి జరిగిన కొద్దిసేపటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. నాందేడ్ ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడి వెనుక ఉద్దేశం ఏంటో దర్యాప్తు చేయాలని పోలీసులకు ఆయన నిర్దేశించారు. ఇదిలా ఉండగా, దాదాపు రెండేళ్ల కిందట అమృత్‌సర్‌లో జరిగిన హత్యాయత్నం నుంచి బాదల్ త్రుటిలో తప్పించుకున్నారు. డిసెంబరు 4, 2024లో స్వర్ణదేవాలయం బయట ఆయనపై ఓ యువకుడు కాల్పులకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో బాదల్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దుండగుడ్ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

2007 నుంచి 2017 వరకు పంజాబ్‌లో కొనసాగిన శిరోమణి అకాలీదళ్ పార్టీ బీజేపీ కూటమి పాలనలో చేసిన 'తప్పులకు' గాను, బాదల్, పలువురు ఎస్ఏడీ నాయకులకు అకాల్ తఖ్త్ 'టాంఖా' (మతపరమైన శిక్ష) విధించిన తరువాత ఆయన స్వర్ణ దేవాలయంలో 'సేవాదార్' విధులు నిర్వర్తిస్తుండగా ఆయనపై దాడి జరిగింది. కాగా, ప్రాణాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నందున సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు అత్యున్నత స్థాయి జెడ్‌ప్లస్ భద్రత కొనసాగుతోంది.

# దేశంలోనే నంబర్ వన్ రాజధానిగా అమరావతి



(మొదటి పేజీ తరువాయి)

అన్ని కష్టాలను అధిగమించి అమరావతి రాజధాని నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించామని చంద్రబాబు అన్నారు. రాజధానిలో విద్యుత్ తీగలు, కరెంట్ పోల్స్ కనిపించకుండా ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి నేరుగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్యాస్‌పై ఆధారపడకుండా వంట చేసుకునే సౌకర్యాలను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేని స్థాయిలో అమరావతికి నీటి వనరులు ఉన్నాయని చంద్రబాబు అన్నారు. కృష్ణా నది తీరంలో రాజధాని నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ప్రకృతి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ అమరావతిని ఆధునిక, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

**బ్లూ సిటీ.. గ్రీన్ సిటీ.. గ్రీన్ ఎనర్జీ**

అమరావతిని నో పొల్యూషన్ సిటీ, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. కాలుష్యరహిత వాతావరణంతో పాటు ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అమరావతిని భవిష్యత్తులో డీప్‌టెక్ క్యాపిటల్గా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతిలో నివసించే ప్రజలకు ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యమని చంద్రబాబు అన్నారు. అమరావతిలో జీవించే వారికి ఆయుష్షు పెరిగేంత ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాజధానిలో ప్రయాణించేటప్పుడు ప్రత్యేకమైన అనుభూతి కలిగేలా రహదారులు, భవనాలు, మౌలిక వసతులను నిర్మిస్తున్నామని తెలిపారు.

**కరకట్ట కష్టాలకు ఇక చెక్**

ఇప్పటివరకు ప్రజలు ఎదుర్కొన్న కరకట్ట ప్రాంత ప్రయాణ కష్టాలు ఇకపై ఉండవని చంద్రబాబు అన్నారు. ఆధునిక రహదారులు, మెరుగైన కనెక్టివిటీ, సమగ్ర మౌలిక వసతులతో అమరావతి ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రాజధానిగా మారనుందని స్పష్టం చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

**నా గ్రేట్ విజన్‌కు తొలి సక్సెస్**

రాజధాని అమరావతి నిర్మాణంలో రైతుల పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి రైతులది కేవలం త్యాగం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే అంశమని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం తన గ్రేట్ విజన్‌కు తొలి విజయమని అన్నారు. రైతుల నమ్మకం, సహకారం లేకపోతే అమరావతి రాజధాని సాధ్యమయ్యేది కాదని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిని అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ3ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిల ప్రారంభానికి సూచికగా శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

**రాజధాని ఎక్కడ అన్నదానిపై తొలుత గందరగోళం**

2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు కొత్త రాష్ట్రానికి రాజధాని ఎక్కడ ఉండాలనే అంశంపై స్పష్టత లేకపోయిందని చంద్రబాబు తెలిపారు. శివరామకృష్ణన్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశామని, కమిటీ నివేదికలో మెజార్టీ ప్రజలు రాజధానిని ఈ ప్రాంతంలోనే నిర్మించాలని అభిప్రాయపడ్డారని చెప్పారు. అనంతరం అసెంబ్లీలో చర్చ జరిగి అమరావతిని రాజధానిగా నిర్ణయించినట్లు తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి రాష్ట్రంగా ఏర్పడిందని, రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమరావతిలో రాజధాని నిర్మించాలని సంకల్పించినట్లు సీఎం వివరించారు.

**హైటెక్ సిటీని కట్టినప్పుడు కూడా విమర్శలు**

తాను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించేటప్పుడు కూడా పలువురు విమర్శలు చేశారని చంద్రబాబు గుర్తుచేశారు. రోడ్లు వేసి తాను షో చేస్తున్నానని కొందరు ఎగతాళి చేశారని, అయినా వెనక్కి తగ్గలేదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక వసతులను నిర్మించి చూపించానని చెప్పారు. అదే నమ్మకంతో అమరావతి నిర్మాణానికి రైతులు ముందుకొచ్చారని సీఎం తెలిపారు. తాను సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవాన్ని చూసి రైతుల్లో విశ్వాసం పెరిగిందని, విజయవాడ, గుంటూరు, మంగళగిరి, అమరావతి ప్రాంతాల రైతులు రాజధాని కోసం భూములు ఇచ్చారని పేర్కొన్నారు.

**రైతులు లేకపోతే అమరావతి లేదు**

**రాజధాని నిర్మాణానికి రైతులు ముందుకు రాకపోతే అమరావతి సాధ్యమయ్యేది కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అమరావతి రైతులది త్యాగమే కాకుండా గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.**

**సింగపూర్ మాస్టర్ ప్లాన్.. ఒక్క రూపాయి తీసుకోలేదు**

**అమరావతిని సింగపూర్ తరహాలో ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించాలనే సంకల్పంతో తాను సింగపూర్ వెళ్లినట్లు చంద్రబాబు తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో సింగపూర్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అమరావతి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలు అందించిందన్నారు. ఐకానిక్ భవనాలు, అసెంబ్లీ భవనాలకు సింగపూర్ డిజైన్లు ఇచ్చిందని చెప్పారు. అయితే ఆ డిజైన్లను చూసి కొందరు 'గ్రాఫిక్స్ రాజధాని' అంటూ ఎగతాళి చేశారని చంద్రబాబు విమర్శించారు. ఆ డిజైన్లు వాస్తవరూపం దాల్చితే అప్పట్లో విమర్శలు చేసిన రాజకీయ పార్టీలు, నాయకులు ఏమవుతారో ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు.**

# ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలి

(మొదటి పేజీ తరువాయి)

**అలాంటిది ఆరుసార్లు ప్రజల మనసు దోచుకుని కన్నా లక్ష్మీనారాయణ గెలిచారని ప్రస్తావించారు. అప్పటిలా జనం లేరని.. పూర్వం నాయకులు ఇప్పుడు లేరని అన్నారు. కన్నా క్రమశిక్షణ, వచ్చిన వారిని పలకరించటం, పని అవుతుం దంటే చేసి పెట్టడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో వారి అవసరాలు తీర్చేలా పని చేశారని ప్రశంసించారు. కన్నా మాదిరిగా మిగతా వారు పని చేస్తే ఏపీ బాగుపడుతుందని తెలిపారు. రాజకీయాలు ఇప్పుడు వ్యాపారం అయ్యాయని అన్నారు. కన్నా మరింత ఆరోగ్యంగా ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.**

# భూ కేటాయింపులపై బీఆర్ఎస్ రాజకీయం

హైదరాబాద్, ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్



టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదు" అని ఎంపీ చామల వివరించారు.

# టీఎంసీ ప్రభుత్వం ఇచ్చిన అవార్డు వెనక్కి

- బీజేపీకి చెందిన రాజ్యసభ ఎంపీ
- నేతాజీ బోస్‌ను 'యుద్ధ నేరస్థుడు' అంటూ
- నాగేంద్ర రాయ్ కామెంట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను అవమానించారనే ఆరోపణలు ఎదుర్కొంటోన్న బీజేపీ ఎంపీ నాగేంద్ర రాయ్‌కు పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం షాకిచ్చింది. ఆయనకు గతంలో ఇచ్చిన 'బంగ విభూషణ్' అవార్డును వెనక్కి తీసుకుంటున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి మమతా బెనర్జీ ప్రభుత్వం ఆయనను ఈ అవార్డుతో సత్కరించింది. నాగేంద్ర రాయ్ అనంత్ మహరాజ్ పేరుతో పాపులర్ అయ్యారు. నేతాజీపై గత నెలలో అనంత్ మహరాజ్ చేసిన వ్యాఖ్యలతో బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆజాద్ హింద్ ఫౌజ్ పాత్ర, నేతాజీ నాయకత్వం, కూచ్ బెహార్ మహారాజు చారిత్రక ప్రాముఖ్యతకు సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ప్రతిపక్షాలతో పాటు బీజేపీలోని ఒక వర్గం కూడా ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడు, బెంగాల్‌లో అత్యంత గౌరవనీయ నాయకుడైన నేతాజీపై సోషల్ మీడియాలో అభ్యంతరర వ్యాఖ్యలు చేసే వారిపై అరెస్టులతో సహా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సువేందు అధికారి పోలీసులను ఆదేశించిన 24 గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ చట్టం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులకు సమానంగా వర్తిస్తుందని కూడా ఆయన తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అజాద్ హింద్ ఫౌజ్ పాత్ర, బోస్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ నేతాజీని 'యుద్ధ నేరస్థుడు' అని అనంత్ మహరాజ్ అభివర్ణించిన కొద్ది రోజులకే సీఎం సువేందు అధికారి పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర బెంగాల్‌లోని రాజబన్షీ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ బీజేపీ నాయకులలో ఒకరైన అనంత మహారాజ్.. రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఫిబ్రవరిలో ఈ బీజేపీ ఎంపీకి బంగా బిభూషణ్ పురస్కారం లభించింది. రాష్ట్రానికి, దాని ప్రజలకు చేసిన విశిష్టమైన, ఆదర్శప్రాయమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేస్తారని, దీనికి అత్యున్నత గౌరవం, ప్రతిష్ట ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'బంగ విభూషణ్ పురస్కారానికి నాగేంద్ర రాయ్ అర్హుడు కాదు.. అవార్డుకు ఉన్న గౌరవం, ప్రతిష్టకు తగినట్లుగా లేదని సంబంధిత అధికారి సంతృప్తి చెందారు. కాబట్టి, 2026 ఫిబ్రవరి 21న ప్రదానం చేసిన బంగ విభూషణ్ పురస్కారాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకుంటూ రద్దు చేస్తోంది" అని ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, గత నెల అమిత్ షా పర్యటన సందర్భంగా గ్రేటర్ కూచ్ బెహార్ పీపుల్స్ అసోసియేషన్‌లో బీజేపీపై కూడా ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# వివాదానికి ఇక ముగింపు పలకండి.. మాల్యా, ఎస్‌బీఐకు బాంబే హైకోర్టు సూచన



పరారీలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఓ ముగింపునకు తీసుకురావాలని తెలిపింది. ఈ వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను జస్టిస్ మిలింద్ జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చోకుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం పలు బ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను చెల్లించకపోవడంతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దీంతో 2019లో ఆయన్ను "పరారైన ఆర్థిక నేరస్థుడి"గా ప్రకటించారు. చట్ట ప్రకారం మాల్యా ఆస్తులను జప్తు చేసి రుణాల రికవరీకి చర్యలు చేపట్టారు. దీంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే.. మాల్యా తొలుత భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే, బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. మరోవైపు, మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్‌తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# హైవే అంబులెన్సులు.. 10 నిమిషాల్లో చేరుకోకుంటే రూ.10వేల పెనాల్టీ

జాతీయ రహదారులపై ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు అత్యవసరంగా స్పందించడంలో జాప్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ .. సంబంధిత నిబంధనలను మరింత కఠినతరం చేసింది. నేషనల్ హైవేలపై మోహరించే అంబులెన్సులు పది కిలో మీటర్ల పరిధిలోని ఏ ప్రమాద స్థలానికైనా పది నిమిషాల్లో చేరుకోవాలని నిర్దేశించింది. లేదంటే ఒక్కో ప్రమాదానికి రూ.10వేల జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అంబులెన్సులు టికెట్ స్వీకరించిన తర్వాత గంటలోపే ప్రమాద బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలని పేర్కొంది. నిర్దేశించిన గడువులోగా చేర్చకున్నా రూ.10 వేల పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.

ప్రమాద సంఘటనల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్‌హెచ్ఏఐ కేర్ సిస్టమ్ (NHAI Care System) తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అంబులెన్సులు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాలు సహా ఆన్‌రోడ్ యూనిట్ల నిర్వహణకు కొత్త నిబంధనలు రూపొందించింది.

నూతన మార్గదర్శకాల ప్రకారం.. సంఘటన జరిగిన ప్రదేశాన్ని బట్టి పది కి.మీ పరిధిలోని ప్రమాద స్థలికి చేరుకునేందుకు 10నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదు. అంతకన్నా ఎక్కువ దూరం ఉంటే అందుకు అనుగుణంగా కొంత ఎక్కువ సమయం తీసుకోవచ్చు. వాహనానికి ఉండే జీపీఎస్ ద్వారా అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు.

ఏదైనా అత్యవసర టికెట్‌ను అంబులెన్సు తిరస్కరించినా రూ.10 వేల జరిమానా పడుతుంది. కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం అన్ని పరికరాలు, ఔషధాలు, సిబ్బంది ఉండాలి. లేదంటే జరిమానా తప్పదు.

ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ప్రస్తుతం 50వేల కి.మీ మేర జాతీయ రహదారులున్నాయి. వీటిపై 3000 అంబులెన్సులు, 1000 పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఏఐఎస్400 కంప్లైంట్ జీపీఎస్ పరికరాలు ఉండడంతోపాటు ఒక్కో వాహనంలో ఐఓటీ సిమ్‌తో కూడిన ఆండ్రాయిడ్ మొబైల్ కూడా ఉంటుంది.

జాతీయ రహదారుల్లో హెల్ప్‌లైన్ కోసం 1033 నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రమాదాల వేళ అత్యవసర స్పందనలో జాప్యాన్ని తగ్గించాలని రోడ్డు భద్రతపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీతోపాటు కాగ్ (CAG) ఆడిట్ నివేదికలు సూచించిన విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ గుర్తుచేసింది.



ఈ నేపథ్యంలో ఈ నూతన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని అందరు ప్రాజెక్టు డైరెక్టర్లు, రీజినల్ ఆఫీసర్లకు ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. అలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

# నా సూచనలు పట్టించుకోలేదు.. అందుకే పార్టీ మారా హర్భజన్ సింగ్



ఆమ్ ఆద్మీ పార్టీ లో తన మాటకు విలువ లేకపోవడంతోనే భాజపాలో చేరినట్లు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని.. తన సూచనలు పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

"రాజ్యసభలో ఆప్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశా. పంజాబ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్‌లో చేరా. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడేవాడిని కాదు" అని హర్భజన్ చెప్పారు. పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. "నేను ఎవరిని మోసం చేశాను? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను" అని అన్నారు.

**మత్తుతో యువత భవిష్యత్తు నాశనం..**

పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

# నా ప్రసంగం తర్వాత శుద్ధి చేశారు: రాజ్యసభలో ఖర్గే వ్యాఖ్యలు



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరిరోజున ఎగువ సభలో గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్ ర్యాలీలో భాగంగా తన ప్రసంగం తర్వాత వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై వెంటనే కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. అదొక దురదృష్టకర ఘటన అని, అటువంటి కార్యక్రమాలను భాజపా ఏమాత్రం సమర్థించబోదని స్పష్టం చేశారు.

ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. రెండురోజుల తర్వాత ఒక గ్రూప్ అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో గురువారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "నేను పాల్గొన్న ర్యాలీలో లక్షల మంది హాజరయ్యారు. నేను ఏ వర్గాన్ని గానీ, మతాన్ని గానీ ప్రస్తావించలేదు. ప్రజల సమస్యల గురించి మాత్రమే మాట్లాడాను. కానీ ప్రసంగం తర్వాత కొందరు అడిగారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితా..? ఇది భాజపా కార్యకర్తల పనే" అని తీవ్ర ఎంపీలు నినాదాలు చేశారు. రాజ్యసభ ఛైర్మన్ కలుగజేసుకొని వారికి సర్దిచెప్పారు. ఈ ప్రపంచంలో అంటరానితనానికి మించిన పాపం లేదన్నారు. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదని, వారిని పట్టుకోవాలని ఛైర్మన్ సూచించారు.

అయితే, భాజపా కార్యకర్తల పనంటూ ఖర్గే చేసిన ఆరోపణలను జేపీ నడ్డా ఖండించారు. ఆ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "భాజపా చేసిందని పదేపదే చెప్పొద్దు. మా పార్టీ అలాంటి వాటిని ప్రోత్సహించదు. ఆ ఘటనపై దర్యాప్తు జరిపిస్తాం" అని హామీ ఇచ్చారు.

## అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడి

శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పై దాడి జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న గురుద్వారా సమీపంలో ఓ వ్యక్తి ఆయనపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో బాదల్ కుడి చేతికి గాయమైంది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

దాడి జరిగిన సమయంలో బాదల్ సతీమణి, అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ సైతం ఆయన వెంటే ఉన్నారు. ఈ ఘటనలో బాదల్ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. 2024 డిసెంబర్‌లోనూ బాదల్‌పై ఓసారి హత్యాయత్నం జరిగింది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వెలుపల ఓ వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపారు. అయితే, బుల్లెట్ గురితప్పడంతో ఈ ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. దుండగుడిని పోలీసులు అక్కడికక్కడే అరెస్టు చేశారు. పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్ తనయుడే సుఖ్‌బీర్ సింగ్ బాదల్. 2009 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు పంజాబ్ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. సుఖ్‌బీర్‌పై దాడి విషయం తెలుసుకున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్.. నాందేడ్ ఎస్పీతో మాట్లాడారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశించారు. మరోవైపు, తమ చీఫ్‌పై దాడిని శిరోమణి అకాలీదళ్ తీవ్రంగా ఖండించింది.



## రూ.500 లంచం ఇచ్చినందుకు బాధపడ్డ ఐపీఎస్.. రూ.కోటి అవినీతి కేసులో ఇరుక్కుని..!



సివిల్ సర్వీసెస్ అభ్యర్థిగా ఉన్నప్పుడు రూ.500 లంచం ఇవ్వాల్సి వచ్చిందని బాధపడిన వ్యక్తి.. ఉద్యోగం సాధించాక రూ.కోటి లంచం తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ అధికారి రాహుల్ బన్సాల్‌పై ఈ ఆరోపణలు వచ్చాయి. బాధితులు ఇందుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారం దిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానికి చేరింది. ఐపీఎస్‌గా ఎంపికైన తర్వాత రాహుల్ బన్సాల్ ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో సీఎస్పీగా విధుల్లో చేరారు. ఆ సమయంలో ఓ సైబర్ నేరానికి సంబంధించిన సెటిల్‌మెంట్‌లో భాగంగా ఆయన రూ.కోటి లంచం తీసుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. రెండు దఫాలు ఈ మొత్తాన్ని ఆయనకు బదిలీ చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాట్సప్ రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను వారు సమర్పించారు. వీటిని పరిశీలించిన న్యాయస్థానం.. ఘటనపై నివేదిక ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆదేశించింది. కాగా.. సివిల్ సర్వీసెస్‌లో చేరకముందు రాహుల్ ఇచ్చిన మాక్ ఇంటర్వ్యూ వీడియో ఒకటి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

"నా సోదరుడు అమెరికా వెళ్లేందుకు జనన ధ్రువీకరణ పత్రం అత్యవసరంగా అవసరమైంది. దాన్ని త్వరగా ఇచ్చేందుకు పంచాయతీ అధికారి రూ.500 లంచం అడిగారు. ఆ మొత్తం చెల్లించడం నాకు చాలా బాధగా అనిపించింది" అని బన్సాల్ చెప్పినట్లు ఆ వీడియోలో ఉంది. అదే ఇంటర్వ్యూలో అవినీతి, అసమర్థతపై బన్సాల్ మాట్లాడారు. కొందరు అధికారులు చేసే తప్పులకు అందరినీ బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఇప్పుడు ఆయనపై రూ.కోటి లంచం ఆరోపణలు రావడంతో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, రాహుల్‌పై వచ్చిన ఆరోపణలపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

## మురికి కాలువల నుంచే బొద్దింకలు వస్తాయి.. నా వ్యాఖ్యల్లో తప్పేముంది:



జెన్ జీపై ఎంపీ కంగనారనౌత్ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. తాజాగా తన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. తన కామెంట్స్ దేశంలోని యువత మొత్తాన్ని ఉద్దేశించినవి కావని.. కొందరు వ్యక్తులను మాత్రమే ఉద్దేశించి అన్నట్లు ఆమె స్పష్టం చేశారు.

"తమను తాము బొద్దింకలు అని అభివర్ణించుకునే వారి గురించి మాత్రమే నేను మాట్లాడాను. బొద్దింకలు మురికి కాలువల నుంచే వస్తాయి కదా, అలాంటప్పుడు నేను అన్న మాటల్లో తప్పేముంది? నా పాయింట్ చాలా స్పష్టంగా ఉంది. కొందరు తమను తాము బొద్దింకలు అని చెబుతుందే.. మురికికాలువే వారి ఇల్లు అని మనం అంటే వారు ఎందుకు కోప్పడాలి? నేను యువత మొత్తాన్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని అనడం సరికాదు" అని చెప్పారు.

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జెన్‌జీ నిరసనకారులకు సంబంధించిన వీడియోలను ఉద్దేశించి గతంలో కంగనా ఈ కామెంట్స్ చేశారు. జెన్‌జీ అంటే 'గట్టర్ జనరేషన్' అని ఆమె పేర్కొన్నారు. "నా జీవితంలో ఒకే దగ్గర ఇంత కంపును ఎప్పుడూ చూడలేదు. జెన్ జీ నిరసనకారుల రీల్స్ వాంతులు తెప్పించేలా ఉన్నాయి. వారు మాట్లాడే విధానం, వాడే భాష నేనెప్పుడూ చూడలేదు" అంటూ సామాజిక మాధ్యమం వేదికగా విరుచుకుపడ్డారు.

## ఎర్రకోట బాంబు పేలుడు అల్–ఖైదా పనే..!



దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబరులో జరిగిన పేలుడుకు అల్‌ఖైదా అనుబంధ సంస్థ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ధ్రువీకరించింది. ఈ దాడితో 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ 'కు సంబంధం ఉందని పేర్కొంది. ఈ మేరకు దీనిపై నివేదిక విడుదల చేసింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఏక్యూఐఎస్ గతంలో చిన్న బృందంగా ఉండేదని.. ప్రస్తుతం ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా రూపాంతరం చెందుతోందని ఐరాస భద్రతా మండలి తన నివేదికలో తెలిపింది. అల్‌ఖైదా, ఐసిస్ సంస్థలు రసాయన, జీవ ఆయుధాల తయారీపై చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంది. భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్‌ను స్థావరం చేసుకొని, అక్కడ తమ ముఠాలను బలోపేతం చేయడానికి AQIS తీవ్రంగా ప్రయత్నిస్తోంది వెల్లడించింది.

## పరదేశీ.. కాంగ్రెస్.. పంజాబీ.. నమ్మండీ.. ఇవీ పేర్లేనండీ



'విదేశీ', 'పరదేశీ', 'అంగ్రేజ్', 'కాంగ్రెస్', 'పంజాబీ'.. ఇవన్నీ వ్యక్తుల పేర్లే! మనం నమ్మి తీరాల్సిందే!! ఎవరైనా జాతకం ప్రకారమో, సెంటిమెంట్‌తోనో.. తమ సంతానానికి పేర్లు పెట్టుకుంటారు. బిహార్‌లోని గయా జిల్లా ఆమస్ పంచాయతీ భూప్‌నగర్ గ్రామానికి చెందిన మాంఝీ కుటుంబ పెద్దలు మాత్రం.. తాము చూసిన, విన్న విషయాల ఆధారంగా పేర్లు పెడుతుంటారు. దీని వెనక ఉన్న కథను 80 ఏళ్ల గులాటీ మాంఝీ వివరించారు. 'మా పూర్వీకులు అడవిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో నివసించేవారు. వాళ్లకి పిల్లలకు పేర్లు పెట్టాలనే అవగాహన ఉండేది కాదు.

చిన్నప్పుడు నేను పాములాగా దొర్లేవాడినని 'గులాటీ' అనే పేరు పెట్టారు. ఏదైనా భాష, రాజకీయ పార్టీ, ఆసక్తికరంగా ఉన్న పదాలు వినగానే అవే పెట్టేవాళ్లు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బ్రిటిష్ వారిని ఉద్దేశించి వాడే 'విదేశీ' అనే పదాన్ని విని మా తాత మా తండ్రికి పెట్టారు. మా సోదరుడు వేరే రాష్ట్రంలో పుడితే 'పరదేశీ' అన్నారు. తర్వాత ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది' అని చెప్పుకొచ్చారు. ఆధార్, రేషన్ ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లోనూ ఈ విచిత్రమైన పేర్లు ఇలాగే నమోదయ్యాయి.

## త్వరలో 'జంతర్ మంతర్ సీజన్ 2'.. మరో ఉద్యమంపై దీప్కే ప్రకటన

శ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద 36 రోజుల పాటు ఆందోళన నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరో నిరసనకు సిద్ధమవుతోంది. ఈసారి విద్య, ప్రజా సమస్యలపై దృష్టి పెడుతూ దేశవ్యాప్తంగా 'ప్రజల మాట విందాం యాత్ర'ను చేపట్టబోతున్నట్లు ప్రకటించింది. దీనిని 'జంతర్ మంతర్ సీజన్ 2' గా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ఈ ఆందోళనను ఎప్పుడు ప్రారంభిస్తారంటూ సోషల్ మీడియాలో సందేశాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. త్వరలోనే జంతర్ మంతర్ సీజన్ 2ను ప్రారంభించబోతున్నామని స్పష్టం చేశారు. దిల్లీలో బుధవారం తలపెట్టిన సీజేపీ వాలంటీర్ల సమావేశం రద్దు అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. భాజపా ఒత్తిడితోనే భేటీ నిర్వహించాల్సిన నారాయణలోని సమావేశ మందిరం బుకింగ్‌ను చివరి నిమిషంలో రద్దు చేశారని ఆరోపించారు.

**సీజేపీలోని వ్యక్తుల కార్యకలాపాలపై దర్యాప్తు కోరుతూ పిటిషన్**

నకిలీ న్యాయవాదులు, బూటకపు లా డిగ్రీలు, సీజేపీతో అనుసంధానమైన వ్యక్తుల కార్యాకలాపాలపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం, సీబీఐ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ల స్పందనకు సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయవాది రాజా చౌధరీ ఈ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం ముందు హాజరై వాదనలు వినిపించారు.



# పిడకల వేటకూ దొరకని జెన్–జీ

జంతర్ మంతర్ వద్ద ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనను ఎలా చూడాలి.. అనే దానిమీద ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నట్టున్నాయి. మార్పు మనం కోరుకున్న రీతిలో, మోతాదులో, కోరుకున్న పద్ధతిలో ఉంటే తప్ప చాలా మందికి తృప్తి కలగదు. అంగీకరించకపోయినా ఆ ధోరణిని దాని మూలాలను అర్థం చేసుకోవచ్చు. ఎంత గొప్ప రిలీఫ్ అనే ఫీలింగ్ వల్ల ఇప్పుడు ఏర్పడ్డ పాజిటివ్ వైబ్ పలుచనబడే సన్నివేశాలు మరిన్ని వస్తాయి. డాన్స్ వీడియోలతో కాస్త అటూ ఇటూగా అయిపోవచ్చు. రేపో మాపో మందు బాటిళ్ల విజువల్స్ కూడా ముందుకు రావచ్చు. ఆపైన ఎవరో ఇంకెవరితోనో, ఇంకేదో రకంగా ఉన్న విజువల్స్ వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దెబ్బతిన్న బలవంతుడు ఊరికే ఉండడు. పైగా చేతినిండా బలగం ఉన్నప్పుడు. ఆ శిబిరం సంగతి వదిలేయండి. 'ఆ డాన్సులు గట్రా ఏంటండీ, చేయకపోతే బాగుండేది' అనే దగ్గర సన్నాయి నొక్కులతో బయలుదేరతారే.. వారి గురించి మాట్లాడుకోవాల్సి ఉంది. ఎందుకంటే డాన్స్ దగ్గరే వీడియోలు ఆగవు కాబట్టి. ఇప్పుడు జైకొట్టినోళ్లే అప్పుడు కాస్త స్వరం మార్చి– 'అప్పడే అనుకున్నాం.. ఐడియాలజీ, నిర్మాణం లేకపోతే ఇలాగే…' అంటూ ఆ రూట్లో ముక్కులు చీదే అవకాశం ఉంటుంది కాబట్టి. ఐడియాలజీ, నిర్మాణం అసలు అవసరం లేదు అనట్లేదు కానీ, నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టమైన విశ్లేషణ అవసరం. మన బీకరులోనే అన్నీ ఇమడవు.

మోదీ మీద కోపం వల్ల ఎవరో ఒకరు ఏదో రకంగా మెడలు వంచారనే సంబరం వల్ల ఆమోదం తప్పితే, ఇతరత్రా మనం కోరుకున్న శాస్త్రీయ పద్ధతుల్లో వారెవరూ లేరు అనే చింత, చింతన చాలా మందిలో ఉంటాయి. మనవల్ల కానిది పిల్లకాయలు చేశారు అనే ఉత్సాహాన్ని శాస్త్రీయ శర్మీయ ఆలోచనా పద్ధతుల త్రాసు అటూ ఇటూ చేస్తా ఉంటది. అక్కడ కాస్త మాట్లాడుకోవాల్సి ఉంది.

ఇది పూర్తిగా మరో తరం. దాని కోపం, ప్రేమ, ద్వేషం, ఆనందం వేరే రూపాల్లో వ్యక్తం అవుతుంది. తొలి మూడు సెకన్లలో నువ్వు కండ్లలో కండ్లు పెట్టి నిలపలేకపోతే తప్పకునిపోతుంది, తప్పించుకునిపోతుంది. ఈ బోరింగ్ బ్యాచ్‌తో నాకెందుకు అని. దిసీజ్ ఇన్‌స్టా జనరేషన్. కండెన్స్‌డ్, షార్ప్, ఆంబిషస్ అండ్ ఇండిపెండెంట్!

ధిక్కారం అన్నివేళలా మనం కోరుకున్న పద్ధతుల్లోనే ఉండదు. అసలు మనం కోరుకున్న పద్ధతి అనేది ఎంత అప్డేటెడ్ అనేది వేరే చర్చ. అంతిమంగా ప్రజలకు కనెక్ట్ కావడం కదా దేనికైనా దారి. ఆ దారి మనకు తెలీకపోయిందని చరిత్ర చెబుతున్నది కదా, కాస్త తలవొగ్గి వినడం కూడా నేర్చుకోవాలె. ఈ నేల, దాని మీద కదలికలు మనకు కొన్నిసార్లు నేర్పుతాయి, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలె!

ఇంతకీ వాళ్లేం సాధించారు? భయం అనే పొరను ఛేదించారు. నిరంకుశ పాలకుడితో తలపడుతున్నప్పుడు అదే కదా అతి పెద్ద అడ్డంకి, చైనా వాల్. అదిగో వీళ్లు తమ హ్యూమర్‌తో అట్లా ఈకలాగా తీసిపారేశారు. అది కదా విజయమంటే! ఒక దళితుడి నేతృత్వంలో వేలాది మధ్యతరగతి పిల్లలు కులమతాలకు అతీతంగా ఒక్కటై నినదించారు. ఆడారు, పాడారు. అంతకంటే గొప్ప దృశ్యం ఏం కావాలి. అంబేడ్కర్‌కు కూడా సాధ్యపడని అపూర్వ దృశ్యం. ఆయన దళిత నాయకుడిగానే, ఇంకా చెప్పాలంటే మహర్ల నాయకుడిగానే తనువు చాలించాల్సి వచ్చింది. దీనర్థం.. అంబేడ్కర్ కంటే ఈ కుర్రాడు అభిజిత్ దీప్కే గొప్ప నాయకుడనికాదు. అట్లా దురార్థం తీయకూడదు. ఈ సన్నివేశంలో అతను లేవనెత్తిన డిమాండ్, లేవనెత్తిన తీరు, సందర్భం అన్నీ కలిసి వచ్చాయి. ఎలా వచ్చినా ఒక దళితుడి నాయకత్వాన అంతమంది సవర్ణ విద్యార్థులు పోగవడం ఎప్పుడు చూస్తారండీ! అంతకంటే ఏం చూడాలి మనం!

ఆ రెంటినీ మించింది తిరిగొచ్చిన విశ్వాసం. ఈ మట్టిలో ఇంకా బలముందని పంటలు పండలేనంతగా నాశనం కాలేదని, శ్రుతి–లయ సరిగ్గా కలవాలే కానీ ఇక్కడింకా రాగాలు పలకగలవని చూపించారు కదా! అదెంత గొప్ప ఊరట, అందరికీ! ఎండిపోయిందని దిగాలు పడిన చెట్టుకు మళ్లీ పూతపూయడం కాదూ! స్టడీ చేయాల, తెలుసుకోవాల. తెలియజెప్పడం అనేది మాత్రమే అలవాటైన వారు విద్యార్థులుగా మారితే తప్ప కొన్ని అర్థం కావు. దిసీజ్ నాన్ ఐడియలాజికల్, నాన్ స్ట్రక్చరల్, నాన్ 'సీరియెస్', నాన్ డిస్క్రిప్టివ్ మూవ్‌మెంట్ అండ్ మోమెంట్. అసలది స్టార్ట్ అవ్వడమే సెటైరికల్‌గా స్టార్ట్ అయ్యి, అంతే సెటైర్‌తో బలాన్ని ఎదుర్కొని నిలిచి గెలిచిన మూమెంట్. ఇందులో ఏ పిడకల వేటకూ ఆస్కారం దొరకదు. ఎట్లా పోట్లాడారో అట్లాగే సెలబ్రేట్ కూడా చేసుకుంటారు. అంతిమంగా అందరమూ ఆ డబ్బాలో సెనిక్కాయలు తెచ్చుకుని తింటున్న కుర్రాడి దగ్గరికి, పనిలో దుర్మార్గమైన యాతన ఎదుర్కొంటూ రోదిస్తూ, మనల్ని ఏడిపిస్తూ మాట్లాడుతున్న కార్మికుడి దగ్గరకు రావాల్సి ఉంటుంది. అది ఇంత త్వరగా స్టార్ట్ అయ్యేది కాదు, ముగిసేది కాదు. అది అంతిమ సత్యమే కానీ, ఈ జంతర్ మంతర్ చాటిన సత్యం చిన్నదేమీకాదు. అది చాలా వాటికి ఊపిరినిచ్చింది. దాన్ని చిన్నబుచ్చక్కర్లేదు. అంతిమంగా ఉపాధ్యాయుల పాత్రలోంచి విద్యార్థుల పాత్రలోకి మారాల్సిన సన్నివేశం ఇది. కనెక్షన్ అనే సింగిల్ పాయింట్ స్టడీ ఇప్పటి అవసరం.



# కాగితాలపై ఎక్కువ పని దినాలు..
# క్షేత్రస్థాయిలో తగ్గిన ఉపాధి




జూలైలో వీబీ జిరామ్ జి కింద 7.67 కోట్ల వ్యక్తిపని దినాలు.. గత ఏడాది ఎంజిఎన్ఆర్ఈజి లో 15.33 కోట్లు; ఉపాధి పొందిన కుటుంబాలు 51% తగ్గుదలకొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్-గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ "వీబీ జిరామ్ జి పథకం అమల్లోకి వచ్చిన తొలి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పనలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. దీంతో కొత్త ఉపాధి హామీ పథకం అమలు, అందుబాటుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.2026 జూలైలో ఈ పథకం కింద 7.67 కోట్ల వ్యక్తిపని దినాలు మాత్రమే నమోదయ్యాయి. 2025 జూలైలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఈజి కింద నమోదైన 15.33 కోట్ల వ్యక్తిపని దినాలతో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం తక్కువ. ఉపాధి పొందిన గ్రామీణ కుటుంబాల సంఖ్య కూడా 1.42 కోట్ల నుంచి 68.94 లక్షలకు తగ్గి, 51.45 శాతం క్షీణించింది.2026 జూలై 1 నుంచి వీబీ జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఈజి స్థానంలో అమల్లోకి వచ్చింది. ఈ పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజుల ఉపాధి హామీ కల్పిస్తున్నారు.

**కాలానుగుణ విరామమే ప్రధాన కారణమా?**

కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఉపాధి తగ్గడానికి ఎంజిఎన్ఆర్ఈజి నుంచి కొత్త విధానానికి మార్పు, వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే కాలంలో ఉపాధి కల్పనకు విరామం, బిహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి వలస కార్మికుల సంఖ్య తగ్గడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. కొత్త విధానం ప్రకారం, విత్తనాలు వేయడం, పంట కోత వంటి కీలక వ్యవసాయ కాలాల్లో 60 రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం రాష్ట్రాలకు ఉంది. దీంతో వ్యవసాయ పనులకు కార్మికులు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది. ఎంజిఎన్ఆర్ఈజి లో ఇలాంటి నిబంధన లేదు.గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాత్రం కొత్త విధానంలోకి మార్పు సజావుగానే జరిగిందని చెబుతోంది. ఉపాధి కోరిన గ్రామీణ కుటుంబాల్లో 98 శాతానికి పైగా కుటుంబాలకు పని కల్పించినట్లు పేర్కొంది. జూలైలో వాస్తవ ఉపాధి కల్పన సుమారు 9 కోట్ల వ్యక్తిపని దినాలుగా ఉందని కూడా అంచనా వేసింది.అయితే, కాలానుగుణ పరిమితులు, సాంకేతిక నిబంధనలు, పాత పథకం నుంచి కొత్త పథకానికి మారే క్రమంలో ఏర్పడిన సమస్యలు ఉపాధి గణాంకాల భారీ తగ్గుదలకు కారణమై ఉండవచ్చని విమర్శకులు అంటున్నారు.

**డిమాండ్ ఆధారిత విధానంపై ప్రశ్నలు**

వీబీ జిరామ్ జి, ఎంజిఎన్ఆర్ఈజి లోని డిమాండ్ ఆధారిత విధానం నుంచి మరింత నియంత్రిత, సరఫరా ఆధారిత విధానానికి మార్పును సూచిస్తోందని కార్మిక సంఘాలు, విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.వ్యవసాయ పనులు జరిగే కాలంలో ఉపాధిపై పరిమితులు విధించడం వల్ల ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని వారు అంటున్నారు.అలాగే డిజిటల్ ధ్రువీకరణ, సాంకేతిక ఆధారిత అమలుపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ కార్మికులకు ఈ నిబంధనలు సమస్యగా మారవచ్చని విమర్శకులు పేర్కొంటున్నారు.

**125 రోజులు.. పార్లమెంటరీ కమిటీ సిఫార్సు 150 రోజులు**

వీబీ జిరామ్ జిలో ప్రధాన మార్పుల్లో ఒకటి వార్షిక ఉపాధి హామీని 100 నుంచి 125 రోజులకు పెంచడం. అయితే, గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్థాయి సంఘం చేసిన సిఫార్సు కంటే ఇది తక్కువ.2025 మార్చి 12న సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, ప్రతి కుటుంబానికి హామీ ఇచ్చే ఉపాధి దినాలను 100 నుంచి కనీసం 150 రోజులకు పెంచాలని సిఫార్సు చేసింది. గ్రామీణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఎంజిఎన్ఆర్ఈజి ను సమగ్రంగా సమీక్షించడంతో పాటు, పనుల స్వభావాన్ని విస్తరించాలని కూడా కమిటీ సూచించింది.

**వేతనాలపై ఆందోళన**

కొత్త విధానంలో నైపుణ్యం లేని కూలీలకు ఏకరీతి వేతన రేటును నిర్ణయించే అవకాశం ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను క్రమం తప్పకుండా సవరించే స్పష్టమైన విధానం లేదని విమర్శకులు అంటున్నారు.ధరలు పెరుగుతున్న సమయంలో వేతనాలకు తగిన సూచీ ఆధారిత సవరణలు లేకపోతే గ్రామీణ కార్మికుల వాస్తవ ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇది పేద కుటుంబాలకు సామాజిక భద్రతా వలయంగా ఉండాల్సిన పథకం ప్రభావాన్ని బలహీనపరచవచ్చని అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రాలపై పెరగనున్న ఆర్థిక భారం**

వీబీ జిరామ్ జిలో కేంద్రరాష్ట్రాల మధ్య నిధుల భాగస్వామ్య విధానంలో కూడా మార్పు వచ్చింది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం 90 శాతం వ్యయాన్ని భరిస్తుంది. ఇతర రాష్ట్రాలు, శాసనసభ కలిగిన కేంద్రపాలిత ప్రాంతాల్లో 60:40 నిష్పత్తిలో కేంద్రంరాష్ట్రాలు వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది.ఫిస్కల్ మెమొరాండం ప్రకారం, వేతనాలు, మెటీరియల్, పరిపాలనా ఖర్చులతో కలిపి ఈ పథకం వార్షిక వ్యయం ₹1,51,282 కోట్లుగా అంచనా. ఇందులో కేంద్రం వాటా ₹95,692.31 కోట్లు కాగా, రాష్ట్రాలపై సుమారు ₹56,000 కోట్ల భారం పడనుంది.ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్న రాష్ట్రాలపై పెరిగిన వాటా అదనపు ఆర్థిక ఒత్తిడిని కలిగించవచ్చని విమర్శకులు అంటున్నారు.

**గ్రామీణ సంక్షోభం నేపథ్యంలో ప్రాధాన్యత**

వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో గ్రామీణ ఉపాధి తగ్గడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలోని సుమారు సగం జిల్లాల్లో వర్షపాతం లోటుగా నమోదైందని, ఖరీఫ్ పంటల విస్తీర్ణం 26.50 శాతం తగ్గిందని అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. వ్యవసాయంలో అనిశ్చితి పెరిగినప్పుడు గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భద్రత అవసరం మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యక్తిపని దినాల తగ్గుదల కొత్త పథకం గ్రామీణ కుటుంబాలకు తగిన ఆదాయ మద్దతు అందించగలదా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.

**మహిళలకు కొనసాగుతున్న ప్రాధాన్యం**

మొత్తం ఉపాధి తగ్గినప్పటికీ, మహిళల భాగస్వామ్యం గణనీయంగా ఉంది. మొత్తం వ్యక్తిపని దినాల్లో మహిళలు సుమారు 63 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన కనీసం మూడో వంతు కంటే చాలా ఎక్కువ.దీంతో మొత్తం ఉపాధి గణనీయంగా తగ్గినప్పటికీ, గ్రామీణ మహిళలకు ఈ పథకం ఇప్పటికీ ముఖ్యమైన ఉపాధి వనరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

**ముందున్న అసలు పరీక్ష**

వీబీ జిరామ్ జి తొలి నెల ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఒకవైపు ఉపాధి హామీని 100 నుంచి 125 రోజులకు పెంచింది, మహిళల భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉంది. మరోవైపు వ్యక్తిపని దినాలు, ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్యలో భారీ తగ్గుదల పథకం అమలు, అందుబాటు, ప్రభావంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది.జూలైలో నమోదైన తగ్గుదల కేవలం కాలానుగుణ పరిస్థితులు, ఎంజిఎన్ఆర్ఈజి నుంచి కొత్త విధానానికి మార్పు కారణంగానే జరిగిందా? లేక కొత్త పథకంలో మరింత లోతైన నిర్మాణాత్మక సమస్యలు ఉన్నాయా? అన్నది రాబోయే నెలల్లో స్పష్టమవుతుంది.అంతిమంగా, కాగితాలపై ఎన్ని రోజుల ఉపాధికి హామీ ఇచ్చారన్నది కాదు.. గ్రామీణ కార్మికులు అవసరమైన సమయంలో ఉపాధిని కోరగలరా, పొందగలరా, సకాలంలో పని మరియు వేతనాలు అందుకోగలరా అన్నదే వీబీ జిరామ్ జి విజయానికి అసలు కొలమానం.

– డా. ముచ్చుకోట సురేష్ బాబు

# ప్రకృతి చేస్తున్న హెచ్చరిక

**వర్తమానంలో లాభార్జన కోసం భవిష్యత్తును బలిపెట్టే నయా ఉదారవాద విధానాలు ప్రపంచాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్తున్నాయి. దశాబ్దాలుగా యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో చోటుచేసుకుంటున్న కార్చిచ్చుల్ని పట్టించుకుని పర్యావరణ అనుకూల విధానాలు పాటించని ఫలితంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 37 కోట్ల ఎకరాల్లోని అడవులు, పొదలు తగలబడ్డాయని ఒక అంచనా. ఇలా కార్చిచ్చులో చిక్కుకున్న ప్రాంతం మంగోలియా దేశ విస్తీర్ణానికి సమానమని చెబుతున్నారు.స్పెయిన్, ఫ్రాన్స్ అటవీప్రాంతాల్లో, కెనడా, రష్యాల్లో గత వారం రోజు లుగా వ్యాపిస్తున్న మంటల వల్ల ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్ కార్చిచ్చులైతే ఊహించశక్యం కానంత స్థాయిలో ఉన్నాయి. వాటిని అదుపు చేయగలిగా మని ఆ రెండు దేశాలూ చెబుతున్నా జనంలో భయాందోళనలు ఉపశమించలేదు. నైరుతి ఫ్రాన్స్‌లో పారిస్‌కు నాలుగు రెట్లు పెద్దదైన విస్తీర్ణంలోని అడవి తగలబడటంవల్లగిరోండ్ ప్రాంతంలోని జనావాసాలనుంచి రెండున్నర లక్షలమంది పౌరుల్ని ఆదరా బాదరాగా**



**తరలించాల్సివచ్చింది.**

ముఖ్యంగా బోర్డావ్ నగరంవైపు ఆ మంటలు వ్యాపిస్తున్న తీరు జనాన్ని హడలెత్తించింది. అటు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ లక్ష మందిని తరలించారు. దాని శివారు ప్రాంతాల్లో పలు జనావాసాలు తగలబడిపోయాయి. ఆ రెండూ యుద్ధ రంగాన్ని తలపింపజేస్తున్నాయని మీడియా కథనం. జరగాల్సిన నష్టం జరిగాక మంటల్ని ఏదోమేరకు అదుపు చేయటం సాధ్యమే. కానీ వాటివల్ల వ్యాపించే పొగవల్ల గాలి నాణ్యత దెబ్బతింటుంది. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సూక్ష్మ ధూళి కణాలు పీల్చేగాలిలో వ్యాపించి ఊపిరి తిత్తులు, గుండె సంబంధ వ్యాధులతో ప్రజారోగ్యం క్షీణిస్తుంది. అరుదైన వృక్షసంపద, జీవవైవిధ్యం బుగ్గిపాలవుతుంది. దాని కారణంగా వడగాడ్పులు చెలరేగి జనం అల్లాడిపోతారు. ఈ ఖండాల్లో ఏటా కార్చిచ్చులవల్ల 3,40,000 అకాల మరణాలుసంభ విస్తున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2023లో ప్రపంచ కర్బన ఉద్గారాల్లో కెనడా కార్చిచ్చుల వాటా 23 శాతమని అంచనా వేశారు. యూరప్ ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతున్నదని యూరోపియన్ యూనియన్(ఈయూ) పర్యవేక్షణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఫ్రాన్స్ కార్చిచ్చువల్ల ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాల్లోని పలు ప్రాంతాల్లో పొగ, ధూళితో కూడిన నీటియావిరి వ్యాపించి, అది మేఘాలుగా మారి, ప్రమాదకరమైన పెనుగాలులు, పిడుగుపాట్లు సంభవించాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాధారణంగా ఇలాంటి కార్చిచ్చులు మానవతప్పిదాలతోనే మొదలవుతాయి. కానీ వాతావరణ మార్పుల పర్యవసానంగా అవి వేగంగా విస్తరిస్తాయి. ఈ విషయంలో శాస్త్రవేత్తలు స్థూలంగా అంగీకారానికొచ్చినా, తమ నమూనాలు అందుకోలేనంత స్థాయిలో ఇవి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ తీవ్రతను పసిగట్టడానికి కొత్త ఉపకరణాలు అవసరం కావొచ్చన్నది వారి అభిప్రాయం. ఇప్పుడు స్పెయిన్, ఫ్రాన్సుల్లో మంటలు వ్యాపించిన అడవుల్లో పిక్నిక్‌లు, క్యాంప్ ఫైర్లు ఎక్కువ. అజాగ్రత్తగా ఉండే మనుషులవల్ల నిప్పు రాజుకోవటం, గాలిలో తేమ శాతం తక్కువుండే రాత్రి వేళ మోడువారిన చెట్లు, ఎండుటాకులు అంటుకుని మంటలు వేగంగా వ్యాపించడం రివాజు.

గత కొన్నేళ్లుగా ఈ కార్చిచ్చులవల్ల ఉత్పత్తయ్యే వేడి, పొగ ఆధారంగా పైరోక్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షరహిత పెనుగాలులతో కూడిన తుపానులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఆ వేడిగాలుల కారణంగా ఎక్కడెక్కడో పడే పిడుగులు మరిన్ని అగ్నిప్రమాదాలకూ, కార్చిచ్చులకూ దారితీస్తున్నాయి. విషపూరిత పొగ, బొగ్గు రేణువులతో ఉండే ఈ మేఘాలు అణు విస్ఫోటంలో వచ్చే పొగ మాదిరే దీర్ఘకాలం వాతావరణంలో అలుముకుని సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. 2019-20లో ఆస్ట్రేలియా ఇలాంటి వాతావరణాన్ని చవిచూసింది. దానికి 'బ్లాక్ సమ్మర్' అని పేరుపెట్టారు. ఇకనైనా వాతావరణంతో ఆటలాడటం ప్రమాదకరమని ప్రభుత్వాలు గుర్తించాలి. గుప్పెడు కార్పొరేట్ సంస్థల లాభార్జన కోసం వాతావరణాన్ని బలిపెడితే ఊహకందని ఉత్పాతాలు కాటేస్తాయి. పర్యావరణం ధ్వంసమై మానవాళి మనుగడే పెను ప్రమాదంలో పడుతుంది. తాజా పరిణామాలు చేస్తున్న హెచ్చరిక ఇదే.

# ఈసారి 'ఆల్ఫా' వంతు!

**జంతర్ మంతర్ వేదికగా జెన్ జీ తరం సృష్టించిన పెను సంచలనం గురించి అందరూ ఇంకా చర్చించుకుంటుండగానే… తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆల్ఫా తరం కూడా తరగతి గదుల్లోంచి బయటికొచ్చింది. ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లతో పాటు మహారాష్ట్రలో సైతం పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలవంటి కనీస సదుపాయాలు కల్పించాలనీ, అన్ని పాఠ్యాంశాలకూ టీచర్లను నియమించా లనీ కోరుతూ సాగుతున్న ధర్నాల వెనక కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సాధించిన విజయాల స్ఫూర్తి ఉన్నదని తెలుస్తూనే ఉంది.**

**పాలకుల్ని నిలదీసిన జెన్ జీ తరాన్ని చూసి అసహ్యించుకున్న ఎంపీ కంగనా రనౌత్ లాంటివారు ఈ ఆల్ఫా తరానికి ఎలాంటి శాపనార్థాలు పెడతారో చూడాల్సివుంది. బిహార్‌లోని గయ జిల్లాలో విద్యార్థులు అతి పెద్ద ధర్నా నిర్వహించడమే కాదు… తమ డిమాండ్లు తెలుసుకోవటానికొచ్చిన ప్రభుత్వా ధికారిని వెనక్కిపంపారు. తాము జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్)తో తప్ప మాట్లాడబోమని చెప్పటంతో ఆయనే రావాల్సివచ్చింది. అన్నిచోట్లా ఒకే రకమైన సమస్యలు. అందరిదీ ఒకే రకమైన కథ.**

చదువు చుట్టూ ఇన్ని సమస్యలుండగా 'వికసిత్ భారత్' ఎలా సాధ్యమో పాలకులు చెప్పాలి. దేశంలో ప్రాథమిక విద్య మొదలు విశ్వవిద్యాలయ విద్యవరకూ అంతా అస్తవ్యస్థంగా ఉంది. ఎక్కడ చూసినా శిథిలాలను తలపించే బడులు, అరకొర సదుపా యాలు వెక్కిరిస్తుంటాయి. సరిపడా ఉపాధ్యాయులుండరు. యాదృచ్ఛికంగానే కావొచ్చు గానీ… రాజ్యసభలో గురువారం పాఠశాల విద్య గురించి అడిగిన ప్రశ్నకు విద్యామంత్రిత్వ శాఖ ఇచ్చిన జవాబు దిగ్భ్రమ గొలుపుతుంది. దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 1,00,843 అని ఆ శాఖ సహాయమంత్రి చెప్పారు. అందులో 16,357 పాఠశాలలతో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉంటే జార్ఖండ్(9,827), మహారాష్ట్ర(9,269), కర్ణాటక(8,042), ఉత్తరప్రదేశ్(7,874) తదనంతర స్థానాల్లో ఉన్నాయి.

అలాగని మిగిలిన స్కూళ్లు బాగున్నాయని కాదు. రాజస్థాన్‌లోని ఒక పాఠశాలలో కేవలం చరిత్ర, హిందీ పాఠ్యాంశాలకు మాత్రమే టీచర్లున్నారు. మరో పాఠశాలలో 1,2,3 తరగతులకు అసలు టీచర్లే లేరు. తక్షణం టీచర్ల నియామకం జరగకుంటే పాఠశాలకు తాళాలేసి, రహదారి దిగ్బంధిస్తామని పిల్లలు హెచ్చరించారు. చివరకు అప్పటికప్పుడు నలుగుర్ని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. మరో ముగ్గుర్ని పది రోజుల్లో నియమిస్తామనటంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో లిఖితపూర్వక హామీ దొరికేవరకూ ఇంటర్ విద్యార్థులు ధర్నా కొనసాగించారు.

సెకండరీ విద్యలో 2023-24లో ఆడపిల్లల్లో 12.6 శాతంగా ఉన్న డ్రాపౌట్లు 2025-26కు 8 శాతానికి తగ్గాయని పార్లమెంటుకు సమర్పించిన నివేదిక చెబుతోంది. కానీ ఇప్పటికీ 8 శాతంమంది పిల్లలు ఆ స్థాయికొచ్చాక చదువులు మానుకుంటున్నారంటే ఆవేదన కలుగుతుంది. దీన్ని అంకెల్లోకి మారిస్తే లక్షల్లో ఉంటుంది. ఇది మన అధ్వాన్న స్థితికి అద్దం పడుతుంది. పేదరికం మొదలుకొని పాఠశాలలో సదుపాయాల లేమి వరకూ ఇందుకు ఎన్నో కారణాలుండొచ్చు. వాటిని సరిచేయటానికి పూనుకొనే వరకూ ఇలాంటి పిల్లలు చదువులకు దూరంకాక తప్పదని పాలకులు గుర్తించాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల వ్యథ మరో రకం. అక్కడ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 11,700 కోట్లు వ్యయం చేసి 'నాడు-నేడు' కింద 38,059 పాఠశాలల రూపురేఖల్ని మార్చింది. కార్పొరేట్ విద్యా సంస్థల్ని తలదన్నేలా 60,000 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, 10,000 స్మార్ట్ టీవీలు అమర్చి తరగతి గదుల్ని డిజిటల్ లెర్నింగ్ స్పేస్‌లుగా మార్చింది. పిల్లలకు దాదాపు ఆరు లక్షల ట్యాబ్‌ల్ని అందించి పాఠాల్ని సులభంగా అవగాహన చేసుకునేందుకు తోడ్పడింది. ఇప్పుడు ఉత్తరాదిన వినబడుతున్న డిమాండ్లతోపాటు మరెన్నో నాలుగేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు అందులో చాలా భాగం అటకెక్కాయి. గుక్కెడు మంచినీళ్లు, పరిశుభ్రమైన పరిసరాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం కరువయ్యాయి. గతంలో సకల సదుపాయాలతో వర్ధిల్లిన బడులన్నీ ఇప్పుడు బావురుమంటున్నాయి. అనేకం మూతబడ్డాయి. అందుకే ఉత్తరాది పిల్లల స్ఫూర్తితో రేపో మాపో ఏపీ ఆల్ఫా తరం కూడా తిరగబడినా ఆశ్చర్యం లేదు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం | 14.08.2026 | 01


# అంగన్వాడీ స్థాయిలోనే ఆంగ్ల భాషపై శిక్షణ

**రాప్తాడు ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**




రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సీడీపీఓ శంకరమ్మ, ఎంఈఓ మల్లికార్జున ఆదేశాల మేరకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి 120 ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మూడోరోజు శిక్షణ కొనసాగింది. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అంగన్వాడీ స్థాయి నుంచే ఆంగ్ల భాషపై ప్రాథమిక అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.చిన్న చిన్న ఆంగ్ల పదాలు, గ్రీటింగ్స్, కమాండ్స్, ఎక్స్‌ప్రెషన్స్‌తో పాటు ఇంగ్లీష్ రైమ్స్, స్టోరీస్‌ను చిన్నారులకు సులభంగా నేర్పించాలని సూచించారు. శిక్షణలో భాగంగా అంగన్వాడీ వర్కర్లతో చార్టులు రాయించి, వాటిపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖకు చెందిన డీఆర్పీలు వెంకట నాయుడు, సూర్యనారాయణ, రామ్మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, శ్రీవాణి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

- ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- 5వ డివిజన్ లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది
- వచ్చే స్థానిక సంస్థల్లో మేమే గెలిపిస్తామని ప్రజలంటున్నారన్న దగ్గుపాటి

**అనంతపురం ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**



దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 5వ డివిజన్ లో జరిగిన ఇంటింటికీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దమ్మ దేవాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డివిజన్ లో ఎంత మేర అభివద్ధి చేశామన్నది ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తాము రెండేళ్ల పాలనలో ఇంటింటికీ వెళ్తుంటే.. ప్రజలు ఎంతో సాదరంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ రెండేళ్లుగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారని అన్నారు. మొదటి 5సంతకాలతోనే కీలకమైన హామీలు అమలు చేశామన్నారు. పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి వంటి పథకాలపై ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. 5వ డివిజన్ లో రెండేళ్లలో కోటి రూపాయలతో అభివృద్ధి చేశామని.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 20లక్షల పనులు కూడా చేయలేదన్నారు. నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మేమే మిమ్మల్ని గెలిపించుకుంటామని ప్రజలు అంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి విద్యా వ్యవస్థను నాశనం చేశారని.. పిచ్చి తుగ్లక్ తరహాలో పుస్తకాలు, బ్యాగులపై కూడా తన ఫోటోలు వేసుకున్నారని విమర్శలు చేశారు. విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ రోజు రూ.67.50 లక్షలు తల్లికి వందనం కింద అందిస్తున్నారన్నారు. రెండేళ్లలోనే 25లక్షల కోట్ల పెట్టుబడులు, 25లక్షల ఉద్యోగాలు తీసుకొచ్చారన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. అనంతరం ఇంటింటికి కార్యక్రమాన్ని 100% పూర్తి చేసిన 184వ బూతు ఇంచార్జ్ గీతాంజలిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కృష్ణం రఘు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, బిజెపి రాష్ట్ర నాయకుడు లలిత్ కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు రమాదేవి, సుజాతమ్మ, గీతాంజలి, మారుతి కుమార్ గౌడ్, తొండపునాటి రమేష్, చంద్రమౌళి, సున్నం శ్రీనివాసులు, సింగవరం రవి, కంఠాదేవి, బెస్త వెంకటేష్, బిల్డర్ రాము, దాడి రమేష్, అయేషా నేహా, కదిరయ్య, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, ప్రకాష్ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య నటన చిరస్మరణీయం:మంత్రి కందుల దుర్గేష్



- హాస్య నట చక్రవర్తి పద్మశ్రీ రేలంగి 116వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం ఆగస్టు 13,అనంత జనశక్తి న్యూస్**

తెలుగు వెండితెరపై నవ్వులను పూయించడమే కాకుండా, హాస్య నటుడిగా ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి అగ్ర కథానాయకులతో సమానమైన స్టార్ డమ్ ను పొందిన హాస్య నట చక్రవర్తి, పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆగస్ట్ 13వ తేదీన రేలంగి వెంకట్రామయ్య 116వ జయంతి వేడుకలను పురస్కరించుకొని రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ సమీపంలో ఆయన విగ్రహానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."నవ్వుల రేడు రేలంగి వెంకట్రామయ్యని ప్రత్యక్షంగా చూడకపోయినా, ఆయన నటించిన అద్భుతమైన చిత్రాల ద్వారా ఆయన నటనా చాతుర్యాన్ని మనమందరం ఆస్వాదిస్తూనే ఉన్నాం.కేవలం హావభావాలతోనే కాకుండా తన విలక్షణమైన గొంతు, నడక, నవ్వులతో పాత్రకు ప్రాణం పోసి, ప్రేక్షక లోకాన్ని సమ్మోహితం చేసిన అభినయ తపస్వి, పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన మహానటుడు రేలంగి వెంకట్రామయ్య. ఇటువంటి మహోన్నత నటుడు మన ఉమ్మడి గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి కావడం మనందరికీ ఎంతో గర్వకారణం. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినప్పటికీ, తనదైన నటన ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయి చెరగని నవ్వుల సంతకం చేసిన యుగపురుషుడు.. శెట్టిబలిజ సంఘ నాయకులు, అభిమానులు మరియు ప్రేక్షకులు ప్రతి ఏటా క్రమం తప్పకుండా హాస్యనట సామ్రాట్ రేలంగి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం" అని పేర్కొన్నారు.తెలుగు సినిమా హాస్యానికి పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య మకుటం లేని మహారాజు అని కీర్తిస్తూ కార్యక్రమం అనంతరం "జోహార్ రేలంగి వెంకట్రామయ్య" అంటూ మంత్రి దుర్గేష్ నినదించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు, రేలంగి అభిమానులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత







- మంత్రి నారా లోకేష్ తో వర్శిటీ విశేషాలు పంచుకున్న సునీత
- అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతమన్న సునీత

**అనంతపురం ఆగస్ట్ 13,అనంత జనశక్తి న్యూస్**

అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. మీరు ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలలో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించానని.. ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూనివర్సిటీలో మీరు చదవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసుకున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది మీరు ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్సిటీలో చదువుకున్నారు కాబట్టే.. మీరు రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. ఈరోజు రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకు రావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నారంటే ఇక్కడ మీరు పొందిన విజ్ఞానం అని అర్థమవుతోందన్నారు. ఇలాంటి యూనివర్సిటీలో మీరు చదివినందుకు, అలాగే మీరు మన రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్కేయూనివర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. మీరు ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్‌ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు...

# సాయికృష్ణ మృతి కేసు.. వైకాపా ఎంపీ ప్రైవేట్ పిటిషన్ ప్రక్రియపై హైకోర్టు

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**




సాయికృష్ణ మృతి కేసులో విజయవాడ కోర్టులో వైకాపా ఎంపీ గురుమూర్తి పిటిషన్ దాఖలు చేశారు. సాయికృష్ణ కేసులో డీజీపీ, సీపీ, ఏసీపీని నిందితులుగా చేర్చాలని ఎంపీ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ సౌత్ ఏసీపీ మానస హైకోర్టును ఆశ్రయించారు. ఎంపీ గురుమూర్తి పిటిషన్‌పై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఏసీపీ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. గురుమూర్తి ప్రైవేట్ పిటిషన్ ప్రక్రియపై స్టే విధించింది. ఈ కేసులో సిట్ విచారణ ఉండగా.. ప్రైవేట్ పిటిషన్‌పై విచారణ జరపడం సరికాదని పేర్కొంది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎంపీ గురుమూర్తిని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

# డ్రామాలు వద్దు... గతాన్ని ఆలోచించుకో...!!

- నేతన్నల పేరుతో రాజకీయాలు చేస్తే సహించేది లేదు*
- అర్హులైన ప్రతి నేతన్నకు రూ.25 వేల సాయం అందేలా చర్యలు....
- కేతిరెడ్డి ఆరోపణలు ఆధారరహితం....
- గత ప్రభుత్వ అవకతవకలకు ముందు సమాధానం చెప్పాలి....
- హత్య ఘటనను పక్కదారి పట్టించేందుకే నేతన్న సేవ పై రాజకీయం: బీజేపీ నాయకులు.

**సత్యసాయి జిల్లా ప్రతినిధి**
**, ఆగష్టు 13, అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం నేతన్న సేవ పథకం పై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేస్తున్న విమర్శలు, ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని బీజేపీ నాయకులు మండిపడ్డారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని రాజకీయ ప్రచారానికి వాడుకోవడం మానుకోవాలని హితవు పలికారు. నేతన్నల పై మాట్లాడే ముందు గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పథకం అమలులో వచ్చిన ఫిర్యాదులు, అవకతవకలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గురువారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ ధర్మవరం రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర తదితరులు మాట్లాడారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

**ఒక్క నేతన్న కూడా మిగలకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం.....**

'నేతన్న సేవలో' పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ప్రయోజనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు. ఆగస్టు 7న పథకం అమలు ప్రారంభమైందని, ధర్మవరం నియోజకవర్గంలో అర్హుల సంఖ్యకు సంబంధించి వచ్చిన సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించారని చెప్పారు.

సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ పరిశీలిస్తోందని తెలిపారు. అర్హత ఉన్న ఒక్క చేనేత కార్మికుడు కూడా పథకానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించారని చెప్పారు.

**గతంలోనే నేతన్న నేస్తంపై విచారణ....**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన నేతన్న నేస్తం పథకంలో లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదులు వచ్చాయని బీజేపీ నాయకులు గుర్తుచేశారు. 2020లో అనంతపురం జిల్లా కలెక్టరేట్ నుంచి జారీ చేసిన అధికారిక నోటీసులో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై విచారణకు జాయింట్ కలెక్టర్‌ను నియమించిన అంశాన్ని ప్రస్తావించారు.

“నేతన్నల సంక్షేమంపై ఇప్పుడు నీతులు చెబుతున్న కేతిరెడ్డి ముందుగా తన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులకు సమాధానం చెప్పాలి. ఆ తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి” అని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

**డీఎస్సీపై ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే....**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. సుమారు 5.77 లక్షల మంది అభ్యర్థులు దాదాపు 16 వేల ఉద్యోగాల కోసం పోటీ పడిన ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు.

యువత భవిష్యత్తుతో ముడిపడిన నియామకాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం తగదన్నారు. గతంలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు.

**హత్య ఘటనపై రాజకీయ డ్రామాలు వద్దు....**

ధర్మవరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన దాసరి శ్రీనివాసులు హత్య ఘటనపై కూడా బీజేపీ నాయకులు స్పందించారు. పోలీసుల దర్యాప్తులో నిందితులను గుర్తించి కోర్టు ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే వరకు వేచి చూడాలని సూచించారు.

ఒక కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో రాజకీయ విమర్శలకు బదులుగా కుటుంబానికి అండగా నిలవడం మానవతా బాధ్యత అని అన్నారు. శ్రీనివాసులుకు ముగ్గురు పిల్లలు ఉన్నందున వారి విద్య, భవిష్యత్తుకు అవసరమైన సహాయం అందించే విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం తరఫున సహాయం అందించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

**ఆధారాలు ఉంటే బయటపెట్టండి.....**

కేతిరెడ్డి చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని బీజేపీ నాయకులు సవాల్ చేశారు. కేవలం ఆరోపణలు చేయడం, మీడియా సమావేశాలు పెట్టడం ద్వారా వాస్తవాలు మారవని అన్నారు.

అవినీతి పై మాట్లాడే ముందు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో తనపై వచ్చిన ఆరోపణలు, వివిధ పథకాల అమలుపై వచ్చిన ఫిర్యాదులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

“అధికారం కోల్పోయినా రాజకీయ అబద్ధాల తీరు మారలేదు. నిజాలు చెప్పే దమ్ముంటే ఆధారాలతో రండి.. ఆరోపణలతో కాదు” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**బీసీలు, చేనేతల సంక్షేమమే ప్రాధాన్యం.....**

ధర్మవరం నియోజకవర్గంలో బీసీలు, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి ఆలయంలో అర్చకత్వానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**“ముందుంది ముసళ్ల పండుగ”**

మాజీ ఎమ్మెల్యే అవినీతిపై మాట్లాడే ముందు తన గత పాలనను గుర్తు చేసుకోవాలని బీజేపీ నాయకులు హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై పూర్తి స్థాయిలో సమీక్ష జరిగితే వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు.

“ముందుంది ముసళ్ల పండుగ. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆధారాలు బయటకు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పనిచేస్తుంటే రాజకీయ ఉనికి కోసం ఆందోళనలు చేయడం సరికాదన్నారు. చేనేతల సంక్షేమంపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో బీజేపీ ధర్మవరం రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర, బత్తలపల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, నాయకులు కొంకా నాగార్జున, పనిశెట్టి శివశంకర్, ఓం ప్రకాష్ గౌడ్, జూటూరు వెంకటేష్, పెద్దకోట్ల ఆనంద్, నరేష్, అరవింద్, కార్యకర్తలు, చేనేత ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం
14.08.2026
ఆంధ్రప్రదేశ్ న్యూస్ ANDHRA PRADESH NEWS

# అమరావతి నిర్మాణంలో రైతుల త్యాగాలు చిరస్మరణీయం

- ఆంధ్రుల రాజధాని అమరావతికి సరికొత్త శోభ
- సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్-2, స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రైతుల బహిరంగ సభలో మంత్రి నారాయణ

**అమరావతి ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రుల రాజధాని అమరావతికి సరికొత్త శోభ వచ్చిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అమరావతి ముఖద్వారం ఉండవల్లి వద్ద సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్ 2తో పాటు స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం రైతులతో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి నారాయణ ప్రసంగించారు. సీడ్ యాక్సిస్ రోడ్ అలైన్‌మెంట్, నిర్మాణ వివరాలను ముఖ్యమంత్రికి మంత్రి వివరించారు.అమరావతి రాజధాని నిర్మాణానికి రైతులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మంత్రి నారాయణ అన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల సహకారాన్ని ఎప్పటికీ మరచిపోలేమన్నారు. అమరావతి నిర్మాణంపై రైతులకు ఉన్న విశ్వాసానికి వారి అపూర్వమైన సహకారమే నిదర్శనమని పేర్కొన్నారు.

**58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమి**

రాజధాని నిర్మాణం కోసం 2015 జనవరిలో భూ సమీకరణ ప్రక్రియకు నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. 2015 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు కేవలం 58 రోజుల్లోనే సుమారు 34 వేల ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా అందించారని చెప్పారు. ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా రైతులు తమ భూములను అందించడం దేశ చరిత్రలోనే విశేషమైన విషయమన్నారు.ఎటువంటి కోర్టు కేసులు, వివాదాలు లేకుండా రైతులు భూములు ఇవ్వడం అమరావతి నిర్మాణంపై వారికి ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణానికి రైతులు అందించిన సహకారం, చేసిన



త్యాగాలు చిరస్మరణీయమని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**ఆర్థిక రాజధానిగా అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మారిన పరిస్థితుల్లో రాష్ట్రానికి ఒక ఆర్థిక రాజధానిని నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారని మంత్రి తెలిపారు. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా, మహారాష్ట్రకు ముంబయి ద్వారా, కర్ణాటకకు బెంగళూరు ద్వారా, తమిళనాడుకు చెన్నై ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం వస్తోందని పేర్కొన్నారు.అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఆర్థికంగా బలమైన రాజధాని అవసరమనే ఉద్దేశంతో అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కృష్ణానది ఒడ్డున అమరావతిని నిర్మించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి భావించారని తెలిపారు.శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు రాష్ట్రానికి మధ్యలో అమరావతి ఉండటం, రైలు, రోడ్డు మార్గాల పరంగా మంచి అనుసంధానం ఉండటం రాజధాని ఎంపికకు ప్రధాన కారణాల్లో ఒకటని మంత్రి వివరించారు.

**సింగపూర్ మాస్టర్ ప్లాన్, ఐకానిక్ భవనాలు**

అమరావతిని ప్రణాళికాబద్ధమైన అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసేందుకు సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను ఉచితంగా అందించిందని మంత్రి తెలిపారు. రాజధానిలో ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ సంస్థను సంప్రదించినట్లు చెప్పారు.అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతిని ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు.. భూగర్భ మౌలిక వసతులు**

అమరావతిలో సుమారు 350 కిలోమీటర్ల మేర ట్రంక్ రోడ్లను నిర్మించడంతో పాటు సమగ్ర భూగర్భ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానంగా విద్యుత్, గ్యాస్, టెలిఫోన్, తాగునీటి సరఫరా తదితర సేవలను భూగర్భంలోనే ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. డ్రైనేజీ, పునర్వినియోగ నీటి పైపులైన్లు, వర్షపు నీటి కాలువలు వంటి మౌలిక వసతులను కూడా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**గతంలో పనులకు ఆటంకాలు.. తిరిగి వేగం**

అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర ప్రక్రియలు చేపట్టడానికి సుమారు మూడున్నర సంవత్సరాల సమయం పట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాత సుమారు ఏడాదిన్నర కాలంలో అమరావతి కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.అయితే అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి



మూడు రాజధానుల ప్రతిపాదనను తీసుకురావడంతో అమరావతి నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మంత్రి అన్నారు. నిర్మాణ సంస్థలతో ఉన్న ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేయడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సాంకేతికంగా క్లోజ్ చేసి, తిరిగి టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.గతంలో జరిగిన నిర్మాణ పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో పరీక్షింపజేసిన అనంతరం పనులను తిరిగి ప్రారంభించామని మంత్రి తెలిపారు. సాంకేతికంగా ఎదురైన సమస్యలను నిపుణుల సలహాలతో పరిష్కరిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

**రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా.. వెనక్కి తగ్గని రైతులు**

అమరావతి నిర్మాణానికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినప్పటికీ రైతులు మాత్రం రాజధాని నిర్మాణానికి తమ మద్దతును కొనసాగించారని మంత్రి నారాయణ అన్నారు. రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగినా వారు అమరావతి నిర్మాణానికి సహకరించారని పేర్కొన్నారు.రైతుల త్యాగాలు, సహకారం వల్లే అమరావతి నిర్మాణానికి బలమైన పునాది ఏర్పడిందని మంత్రి తెలిపారు. వారి ఆశలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**రవాణా వ్యవస్థలో కీలకంగా స్టీల్ బ్రిడ్జిలు**

సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జిలు అమరావతి రవాణా వ్యవస్థలో కీలకంగా నిలుస్తాయని మంత్రి నారాయణ తెలిపారు. ఒక వంతెన జాతీయ రహదారితో అనుసంధానం కానుండగా, మరొక వంతెన మంగళగిరి రోడ్డు వైపు అనుసంధానమవుతుందని చెప్పారు. మంగళగిరి వైపు వెళ్లే వంతెన ఇప్పటికే పూర్తయిందని పేర్కొన్నారు.సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్ 2, స్టీల్ బ్రిడ్జి ప్రారంభంతో అమరావతి రవాణా మౌలిక వసతుల్లో మరో కీలక ముందడుగు పడిందన్నారు. రాజధాని నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అమరావతిని రాష్ట్రానికి ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతుల కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు.అమరావతి వంటి ప్రతిష్టాత్మక రాజధాని నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలిపారు. రైతుల సహకారంతో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసి, వారి ఆశలు, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల సాయం



- 30 రోజుల్లోనే పార్టీ ఇన్సూరెన్స్ పరిహారం అందజేసిన టీడీపీ....
- చెక్కును కుటుంబ సభ్యులకు అందజేసిన పరిటాల శ్రీరామ్....

**ధర్మవరం ఆగష్టు 13 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందింది. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పార్టీ తరఫున మంజూరైన రూ.5 లక్షల చెక్కును మృతుడి భార్య జింకా దేవి రెడ్డమ్మకు అందజేశారు. ధర్మవరం పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త జింకా చంద్రశేఖర్ గత జూన్ నెలలో మదనపల్లి సమీపంలో కారు నడుపుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్, చంద్రశేఖర్ టీడీపీ క్రియాశీల సభ్యుడిగా ఉండటాన్ని గుర్తించి వెంటనే పార్టీ ఇన్సూరెన్స్ విభాగానికి సమాచారం అందించి, బీమా పరిహారం కోసం ప్రక్రియను ప్రారంభించారు.

పార్టీ ఇన్సూరెన్స్ విభాగం ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును చంద్రశేఖర్ భార్య జింకా దేవి రెడ్డమ్మకు పరిటాల శ్రీరామ్ అందజేశారు. ప్రమాదం జరిగిన 30 రోజుల్లోనే కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ సాయం అందేలా చర్యలు తీసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అందిస్తున్న బీమా భద్రత కుటుంబానికి ఆర్థికంగా కొంత భరోసా కల్పిస్తుందని తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవ సమీక్ష.

- వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలపై ఆర్డీఓ, డీఎస్పీ సమీక్ష.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్:**

వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ధర్మవరం ఆర్డీఓ, డీఎస్పీ సంయుక్తంగా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ, డీఎస్పీ మాట్లాడుతూ.... నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, పారిశుధ్యం, విద్యుత్ , లైటింగ్, తాగునీటి సదుపాయాలు, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.అలాగే నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలు మరియు నిర్దేశిత విధానాలను ఎటువంటి మినహాయింపు లేకుండా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఖచ్చితంగా పాటించాలని అధికారులు ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ , శాంతిభద్రతల పరంగా ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ తెలిపారు.. నిమజ్జన మార్గాల్లో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్/ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, నీటిపారుదల, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు, ధర్మవరం డివిజన్‌లోని తహసీల్దార్లు, వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



# నేతన్న సేవపై దుష్ప్రచారానికి చెక్ పెట్టాలి

- 90 శాతం మంది నేతన్నల ఖాతాల్లో రూ.25 వేలు జమ....
- మిగిలిన వారికి త్వరలోనే: పరిటాల శ్రీరామ్

**ధర్మవరం ఆగష్టు 13 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నేతన్న సేవ పథకం పై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేస్తున్న విమర్శలపై టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తీవ్రంగా స్పందించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదని, అర్హత ఉన్న ప్రతి నేతన్నకు పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 71,536 మంది చేనేత కార్మికులకు 'నేతన్నల సేవలో' పథకం వర్తించిందని, ధర్మవరం నియోజకవర్గంలోనే 12 వేల మందికి పైగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పథకం ప్రారంభమైన రోజునే అనేక మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.25 వేల చొప్పున జమ అయ్యాయని, వారాంతపు సెలవులు, బ్యాంకింగ్ ప్రక్రియ, సాంకేతిక సమస్యల కారణంగా కొందరికి నగదు జమ కావడంలో స్వల్ప ఆలస్యం జరిగిందన్నారు.

ఇప్పటికే దాదాపు 90 శాతం మంది చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.25 వేలు జమ చేసినట్లు శ్రీరామ్ తెలిపారు. మిగిలిన అర్హుల ఖాతాల్లో కూడా వారం నుంచి పది రోజుల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. సాంకేతిక కారణాలతో నగదు అందని వారి వివరాలను అధికారులు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.

**ఎన్నికలు దగ్గరపడుతుండటంతోనే చేనేతల పై ప్రేమా?**



స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి చేనేత కార్మికులపై అకస్మాత్తుగా ప్రేమ చూపిస్తున్నారని పరిటాల శ్రీరామ్ విమర్శించారు. ఇటీవల నిర్వహించిన ధర్నాల్లో పాల్గొన్న కొందరు వైసీపీ నాయకులకు కూడా 'నేతన్నల సేవలో' పథకం ద్వారా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. "మీ పక్కన ధర్నాలో కూర్చున్న వారిలో ఎంతమందికి రూ.25 వేలు పడ్డాయో చూపించాలా?" అని ప్రశ్నించారు.

మగ్గం లేని ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొచ్చి ధర్నాలు చేయించడం ద్వారా చేనేత కార్మికులను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. చేనేతల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించాల్సింది పోయి, రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**దరఖాస్తులకు అవకాశం ఉన్నా.. దుష్ప్రచారం ఎందుకు?**

అర్హత ఉన్న చేనేత కార్మికులు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని శ్రీరామ్ తెలిపారు. ఈ విషయాన్ని చేనేత కార్మికులకు తెలియజేయాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై కూడా ఉందన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే ఆ విషయాన్ని ప్రచారం చేయకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని విమర్శించారు.

అధికారులను ఇష్టానుసారంగా దూషించడం మానుకోవాలని, "ఇప్పటికీ మీ పాలనలోనే ఉన్నామనుకుంటున్నారా?" అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అధికారులను బెదిరించడం, అవమానించడం సరైన విధానం కాదని హితవు పలికారు.

**రూ.25 వేలు అందుతుంటే ధర్నా దేనికి?**

ఈ నెల 15న నిర్వహించనున్న ధర్నా దేనికోసం చేస్తున్నారో మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేయాలని శ్రీరామ్ డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.25 వేల చొప్పున జమ చేస్తున్న సమయంలో ధర్నాలకు పిలుపునివ్వడం వెనుక రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనం కనిపించడం లేదన్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో కూలి మగ్గాల పై పనిచేసే వారిని కూడా కలుపుకుని సుమారు 12 వేల మంది చేనేత కార్మికులకు పథకం అందుతోందని తెలిపారు. దీనిపై వాస్తవాలను ప్రజలకు వివరించకుండా తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

**డబ్బులు అడిగితే చర్యలు తప్పవు....**

'నేతన్నల సేవలో' పథకం కోసం లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని శ్రీరామ్ సూచించారు. "కొందరు ఆరోపిస్తున్నట్టుగా ఏ ఒక్కరి వద్ద నుంచి కూడా డబ్బులు తీసుకోలేదు" అని స్పష్టం చేశారు.

డబ్బులు డిమాండ్ చేసినట్లు వస్తున్న ఆడియో కాల్స్‌లో స్పష్టమైన పేర్లు లేవని తెలిపారు. అయితే ఎక్కడైనా అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**వైసీపీ నేతల ట్రాప్‌లో పడొద్దు....**

చేనేత కార్మికులు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని పరిటాల శ్రీరామ్ సూచించారు. రాజకీయ నాయకుల ప్రచారాన్ని నమ్మి ఆందోళన చెందకుండా, పథకానికి సంబంధించిన వివరాలను అధికారుల ద్వారా తెలుసుకోవాలని కోరారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పై గందరగోళం సృష్టించడం మానుకోవాలని అన్నారు. అర్హత ఉన్న ప్రతి నేతన్నకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని, సాంకేతిక కారణాలతో నిలిచిన దరఖాస్తులను పరిష్కరించి అర్హులైన వారందరికీ ప్రయోజనం అందిస్తామని పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, పట్టణ అధ్యక్షులు పరిశే సుధాకర్, పట్టణ చేనేత ప్రముఖులు, టిడిపి యువ నాయకులు సంధా రాఘవ, కొత్తపేట ఆది, మైనార్టీ నాయకులు నాగూర్ హుస్సేన్, అత్తర్ రహీం , రాళ్లపల్లి బాబు, పురుషోత్తం గౌడ్, తలారి చంద్రమోహన్ బాబు, జింకా పురుషోత్తం, బొట్టు కిష్ట, జింకల రాజన్న, వంట రమేష్, కొత్తపేట రవి తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవుని సన్నిధిలో శ్రావణమాస అమావాస్య పూజలు

- కూష్మాండ దీపోవత్సంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- 2రోజుల పాటు పూజలు, కంకణదారణ, అన్నదానం
- ప్రతి శనివారం శ్రావణమాస పూజలంటాయన్న పూజారి ధనుంజయఆచారి

**ధర్మవరం ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్:**

ఆషాఢ మాసం ముగింపు, శ్రావణమాస ప్రారంభం వచ్చే చుక్కల అమావాస్య సందర్భంగా ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ సన్నిధిలో ఉన్న అమ్మవారికి ముత్తైదువుల ద్వారా పూజా కార్యక్రమాలు చేశారు. ఆ తర్వాత అమావాస్య గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ్ ఆచారి దోష నివారణ పూజలు చేశారు. కాలభైరవునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్సవ మూర్తికి భక్తులచే అభిషేకాలు చేయించారు. ప్రదోష కాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. ధర్మవరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి.. భైరవునికి పూజలు చేశారు. అమావాస్య తరువాత కంకణదారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వద్ద పూజించిన గుమ్మడికాయలను, కొబ్బరికాయలను, కంకణాలను భక్తులకు అందజేశారు. ఆ తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ధనుంజయ ఆచారి మాట్లాడుతూ.... శ్రావణమాస ప్రారంభంలో వచ్చే అమావాస్యను చుక్కల అమావాస్యగా పిలుస్తారని.. ఆరోజున కొన్ని పరిహారాలు చేస్తే అంతా మంచే జరగడమే కాకుండా జాతకంలో దోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. శ్రావణ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ఆలయ సన్నిధిలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని తెలిపారు..



## పంటల సాగు ప్రణాళిక మార్పు రైతులు చేసుకోవాలి..

- సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మణ్ నాయక్.

**ధర్మవరం రూరల్ ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్:**

పంట సాగు ప్రణాళిక మార్పును రైతులు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం రేకులకుంట శాస్త్రవేత్తలు తోపాటు లక్ష్మణ్ నాయక్ మండలంలోని దర్శనమల, నేలకోట, ఏలుకుంట్ల, బిల్వంపల్లి గ్రామాలలో పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎలనినో పరిస్థితులను అధికమించే విధంగా వాతావరణ సూచనలను అనుసరిస్తూ పంటల సాగు ప్రణాళిక మార్పు చేసుకోవాలని రైతులకుసూచించారు. ప్రస్తుతం ఉన్న పంటలను రక్షక నీటి తడులిచ్చి ఆదుకోవాలని అదేవిధంగా, పొటాషియం నైట్రేట్ 5 గ్రా లీటర్ నీటికి,లేదా 19:19:19, 10 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే పంటను బెట్ట పరిస్థితి నుంచి 15 రోజుల నుంచి 20 రోజుల వరకు కాపాడుకోవచ్చని తెలిపారు.
అలాగే రాబోయే వర్షాల ఆధారంగా ఖాళీగా ఉన్న భూములు, అదేవిధంగా బీడు భూములలో స్వల్పకాలిక రకాలైనటువంటి చిరుధాన్యాలు అయిన కొర్రలు, సజ్జలు, అపరాలు పంటలు అయినా
ఉలవలు,పెసర,మినుము, అలసంద వంటి పంటలను వేసుకోవాలని
అలాగే పంటల బీమా, ఈ పంట నమోదు కచ్చితంగా చేసుకోవాలని తెలిపారు. అలాగే వివిధ పంటలలో పాటించవలసిన నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతుల గురించి పూర్తిగా తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ శేఖర్ బాబు, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్. నారాయణస్వామి, డాక్టర్ నరసింహులు సీనియర్ సైంటిస్ట్ తో పాటు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోపణలు చేయడం కాదు.. ప్రజలపై గౌరవముంటే అసెంబ్లీకి రండి

- అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతల పిచ్చి ప్రేలాపణలు
- అమరావతి గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా వైసీపీకి లేదు
- మెగా డీఎస్సీ పేరుతో యువతను దగా చేసిన ఘనత వైసీపీదే
- అభివృద్ధి అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

**అమరావతి ఆగస్టు 13,అనంత జనశక్తి న్యూస్**



వైసీపీ నేతలు రోడ్డెక్కి ఆరోపణలు చేయడం కాదు.. ప్రజలు ఇచ్చిన తీర్పుపై గౌరవం, చట్టసభలపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి రావాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ చేశారు. మచిలీపట్నం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలకు ఆరోపణలు చేయడం, పారిపోవడం అలవాటుగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేకే వైసీపీ నేతలు పిచ్చి ప్రేలాపణలకు పోతున్నారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాత్రింబవళ్లు రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల కోసం పని చేస్తున్నారు. నిరంతరం సమీక్షలు సమావేశాలతో ఏపీకి పెట్టుబడులు పరిశ్రమల కోసం తపిస్తున్నారు. ప్రతి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ పోలీసు అధికారులతో లా అండ్ఆర్డర్‌పై సమీక్షిస్తున్నారు. బాధ్యత కలిగిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తుంటే.. గతంలో అధికారంలో ఉన్న వారు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.

**'దిశ చట్టం' పేరుతో ప్రజలను మభ్యపెట్టారు**

మహిళలు, ఆడబిడ్డల భద్రత విషయంలో గత ప్రభుత్వం చేసిన ప్రచారానికి, ఆచరణకు పొంతన లేదని మంత్రి విమర్శించారు. దిశ చట్టం పేరుతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప మహిళల భద్రతకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలే ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. కానీ నేడు రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. అసలు లేని చట్టం గురించి వైసీపీ నేతలు ఎందుకు ఇంతలా యాగీ చేస్తున్నారో వారికే తెలియాలని ఎద్దేవా చేశారు.

**అమరావతిపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదు**

మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడి, అమరావతి రైతుల్ని ముప్పుతిప్పలు పెట్టిన వారు.. అమరావతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతిపై వైసీపీ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదు. గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతుల్ని ఎంతలా హింసించారో, ఎంతలా వేధించారో ప్రపంచం మొత్తం చూసింది. చివరికి వారు కట్టుకున్న చీరల గురించి కూడా అవమానకరంగా మాట్లాడిన నీచ సంస్కృతి వైసీపీ నేతలది. అలాంటి వైసీపీ నేతలు నేడు అమరావతిపై కపట ప్రేమను ప్రదర్శించడం మానుకోవాలని హితవు పలికారు.అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ప్రారంభించుకోవడం హర్షణీయం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే టెండర్లు, నిర్మాణ పనులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచస్థాయి నాణ్యతతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడానికి వైసీపీ నేతలు సిగ్గుపడాలన్నారు.

**మెగా డీఎస్సీపై మాట్లాడే హక్కు ఎక్కడిది?**

మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు గత ఐదు సంవత్సరాలు చేసిన ఘనకార్యాన్ని గుర్తు చేసుకోవాలి.

ఏటా మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ హామీలు ఏమయ్యాయో వైసీపీ నేతలు, జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని పూర్తి చేసి 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించింది. వారంతా ఉద్యోగాల్లో చేరిపోయిన తర్వాత రాద్ధాంతం చేయడానికి బుద్ధి ఉండాలన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు దండగ అన్న వారు.. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు వచ్చిన ప్రయోజనాలను ప్రజలు చూస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును రానున్న రోజుల్లో పూర్తి చేసి రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూరుస్తామని మంత్రి పేర్కొన్నారు.

**'దమ్ముంటే అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం'**

మచిలీపట్నం అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని కొల్లు రవీంద్ర ప్రకటించారు. పేర్ని నానికి ధైర్యం ఉంటే మచిలీపట్నం అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్ని నానికి సవాల్ విసిరారు. రాష్ట్ర అభివృద్ధిపై గానీ, వైసీపీ నేతలు చేస్తున్న డీఎస్సీ, శాంతిభద్రతలు, అభివృద్ధి అంశాలన్నింటిపైనా కూలంకషంగా చర్చిద్దామని సవాల్ చేశారు. మచిలీపట్నం అభివృద్ధిపై తాను చేసిన పనులను ప్రజలకు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని, విమర్శలు చేస్తున్న వారు తాము చేసిన పనులపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయడం కంటే ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చకు రావాలని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూకేటాయింపులు, బియ్యం వ్యవహారాలు, ఇతర అంశాలపై కూడా మాజీ మంత్రి సమాధానం చెప్పాలని కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. అయితే వీటిపై వచ్చిన ఆరోపణలు, న్యాయపరమైన అంశాలను సంబంధిత కోర్టు తీర్పులు, అధికారిక రికార్డుల ఆధారంగానే చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేలా తప్పుడు ప్రచారం, నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందని, అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలపై బహిరంగ చర్చకు ఎప్పుడైనా సిద్ధమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం..

- ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలి
- జిల్లా ఇన్‌చార్జ్ గంగయ్య

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, ఆగస్టు 13:**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ గంగయ్య పిలుపునిచ్చారు.అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ ములియగూడ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు అడ్డాల సోమరాజు అధ్యక్షతన పార్టీ శక్తి కేంద్రాల బలోపేతం, ఎన్నికల కార్యాచరణపై గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ గంగయ్యతో పాటు కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బూత్ స్థాయి నుంచి శక్తి కేంద్రాల వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోరాటాలు చేయాలన్నారు.క్రమశిక్షణతో పనిచేసే సామాన్య కార్యకర్తలకు సైతం పార్టీలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా పార్టీ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో 150 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు. మండల ఇన్‌చార్జ్ డొంబు, మాజీ మండల అధ్యక్షుడు తమన్నా, ప్రధాన కార్యదర్శులు రామస్వామి, రామకృష్ణ, శక్తి కేంద్రాల ప్రముఖులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ అసిస్టెంట్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరోనాని అడ్డం పెట్టుకుని నిధులు కాజేశారు

- వైసీపీపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు
- శ్రీనగర్ కాలనీ శివారులో రూ.కోటి అభివృద్ధి పనులకు భూమి పూజ
- 20-25ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం
- శ్రీనగర్ కాలనీ 2వ జూబ్లీహిల్స్ గా మారిందన్న దగ్గుపాటి

**అనంతపురం ఆగస్ట్ 13 అనంత జనశక్తి న్యూస్**



కరోనాని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించుకున్న చరిత్ర వైసీపీ వారిదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీ శివారులో కోటి రూపాయిలతో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. 15ఫైనాన్స్ కార్పొరేషన్ కింద రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్ని టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్ల గొడ్డలిపార్టీ పాలనలో నగరంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. చివరకు కరోనాను కూడా వాడుకుని మున్సిపాల్టీలో నిధులు తిన్నారన్నారు. ఈరోజు 1015ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్డు వేస్తున్నామన్నారు. 2025ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామని దగ్గుపాటి అన్నారు. కేవలం రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులకే 200కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. శ్రీనగర్ కాలనీ 2వ జూబ్లీహిల్స్ గా మారిందని.. ఇక్కడ అభివృద్ధి జరిగింది కాబట్టే నగరంలోనే కాస్ట్లీ కాలనీగా గుర్తింపు వచ్చిందన్నారు. నగరంలో భూముల విలువ పెరిగిందని.. ఇదంతా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి వలనే సాధ్యమైందన్నారు.

వైసీపీ హయాంలో పెట్టి పోయిన మూడున్నర లక్షల టన్నుల చెత్తను తొలగిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తను మరో మూడు నెలల్లో పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. ఇక్కడ పార్కుతో పాటు ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై కసరత్తు

**మంగళగిరి, ఆగస్టు 13:అనంత జనశక్తి న్యూస్**




రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై మంత్రుల బృందం గురువారం మంగళగిరిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.2024-26 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు.ప్రతిపాదించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనంతరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధిత పూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది.ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటి వరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు.

# "జన్మనిస్తూ ఏ తల్లి మరణించరాదు. జన్మించిన ఏ శిశువు మరణించరాదు.



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 13 అనంత జన శక్తి న్యూస్.**

జిల్లాలో జన్మనిస్తూ జన్మనిస్తూ ఏ తల్లి మరణించరాదని జన్మించిన శిశువు మరణానికి గురికారాదని, శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేర్కొన్నారు... మాతా శిశు మరణాల సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రవేక్షులు ఆశ ఆరోగ్య అంగన్వాడీ కార్యకర్తల ఉద్దేశించి ఇరు శాఖలు సమన్వయంతో పనిచేసి మాతా శిశు మరణాలను నిలువరించాలని సూచించారు . సరైన వివాహ వయసులో (21సంవత్సరాలకు ) అమ్మాయిలకు వివాహాలు జరిగేటట్లు ప్రోత్సహించాలని సూచించారు. గర్భస సమయంలోను ప్రసవానంతరము ఆశ ఆరోగ్య కార్యకర్తలు తప్పనిసరిగా గృహ దర్శనములు చేసి అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల వద్ద అన్ని పరీక్షలు చేయించాలని సాధారణ ప్రసవానంతరం అర గంటలోపే తల్లిపాలు బిడ్డకు తాపించాలని తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు జూలై మాసంలో జరిగినటువంటి ఒక మాతృ మరణము మూడు శిశు మరణాలు సంభవించినటువంటి కుటుంబాల బాధను ఎవరూ తీర్చలేనిదని నివారించ తగిన మాతా శిశు మరణాలను అరికట్టుటకు ప్రతి ఒక్కరూ తప్పక కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ బహబూబ్ చాంద్
పిల్లలవైద్య నిపుణులు బాల ప్రణీత్ రెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం రోళ్ల వారు 1జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ చెన్నారెడ్డి డి పి హెచ్ ఎన్ ఓ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ లో పనితీరుపై సమీక్ష



**అనంతపురం, ఆగస్టు 13 :అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గురువారం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ కు సంబంధించి క్షేత్రస్థాయి పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించగా, ఈ సమీక్ష సమావేశానికి డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు నుంచి పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు హాజరయ్యారు. పెన్షన్ పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్బ్యాక్ కు సంబంధించి విశ్లేషణ మరియు ప్రగతి మెరుగుపరచడం మరియు పనితీరుపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అంశాలపై అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను డిఆర్డీఏ పిడి, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ ఇవ్వడం జరిగింది. జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని వారు ఆదేశించారు. ఈ సమావేశంలో పెన్షన్స్ హెచ్.డి డిపిఎం ఎన్.రవీంద్ర బాబు, పెన్షన్స్ ఏపీవో అజంతుల్లా, డిప్యూటీ ఎంపీడీవోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పెన్షన్ పంపిణీ అధికారులు, డిఆర్డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి



- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్
- కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**అనంతపురం, ఆగస్టు 13 :అనంత జనశక్తి న్యూస్**

-రీ-సర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో 6వ దశ కింద చేపట్టిన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు అందాయా లేదా అని రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే ఎంతవరకు జరుగుతుందనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ (Ground Truthing) ప్రక్రియ జరుగుతోండగా, మొత్తం 10,000 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2,700 ఎకరాలలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయింది.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాలను మించి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల తహసిల్దార్ ఆంజనేయ ప్రసాద్, ఆర్ఎస్‌డిటి, మండల సర్వేయర్, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం
14.08.2026
ANDHRA PRADESH NEWS ఆంధ్రప్రదేశ్ న్యూస్

## నారాయణ గారూ...ఇలా రండి!



**- సీడ్ యాక్సిస్ రోడ్డుపై పిలిచి మరీ ఫోటో దిగిన సిఎం**

**అమరావతి ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**

సీడ్ యాక్సిస్ రోడ్ పూర్తి చేసి రాకపోకలకు అనుగుణంగా, అద్భుతంగా తీర్చిదిద్దిన పురపాలక శాఖా మంత్రి నారాయణను సిఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం అనంతరం సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి....అక్కడి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్డుపై ప్రయాణించారు. కాన్వాయ్ ఆపి పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రీనరీ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో ఎదురైన అడ్డంకులు, అధిగమించిన విధానాన్ని మంత్రి నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం సీడ్ యాక్సిస్ రోడ్డు పై సిఎం ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా నారాయణ గారూ ఇలా రండి అంటూ పిలిచి మరీ ఆయనతో సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఫోటో దిగారు. రాజధానికి రాకపోకలకు ఇరుకైన కరకట్ట రోడ్డుపై ఇన్నాళ్లూ పడిన కష్టాలకు ఇక చెక్ పడుతుందని సిఎం అన్నారు. ఇకపై రాజధానిలో ఒక్కో ప్రాజెక్టు పూర్తి చేసుకుంటూ వెళ్లాలని ఈ సందర్భంగా సిఎం మంత్రి నారాయణకు సూచించారు.

## ఎంపీపీ మోడల్ ప్రైమరీ స్కూల్లో పిల్లలకు రక్త పరీక్షలు



**ల్లచెరువు ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువులో బురుజు వద్ద ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్లో రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమంలో భాగంగా సిహెచ్ఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు శారీరక స్క్రీనింగ్ పరీక్షలు ఎత్తు మరియు బరువు విద్యార్థుల రక్తంలో ఎంత హిమోగ్లోబిన్ ఉన్నది అనే పరీక్షలు నిర్వహించడం జరిగింది పిల్లల వయసుకు తగ్గట్టు శారీరక మార్పులను మరియు మానసిక మార్పులను పరిశీలించడమైనదని ఎవరికైనా శారీరక రుగ్మతలు మానసిక రుగ్మతలు ఉన్నాయే మోనని పరీక్షించడమైనది కంటికి సంబంధించిన పరీక్షలు మరియు నులిపురుగుల జబ్బులు ఉన్నాయోమోనని పరీక్షించడమైనది అదేవిదంగా పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత చేతులు శుభ్రం చేసుకోవడం మరియు పిల్లలకు సీజనల్ వ్యాధులు మలేరియా డెంగ్యూ జ్వరాలు రాకుండా దోమతెరలు వాడాలని ఇండ్లలో సాయంత్రం పూట వేపాకు పొగ వేసుకోవాలని అలాగే ఏవైనా జ్వరాలు వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేసుకోవాలని తెలియజేయడమైనది ఈ కార్యక్రమంలో ఏఎన్ యం నస్రీన్ ఆశా కార్యకర్త ఖాదర బి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన టీడీపీ.



**- కార్పొరేషన్ కౌన్సిల్‌లో వైసీపీ విష ప్రచారంపై టీడీపీ కార్పొరేటర్ల కౌంటర్ అటాక్**

**- వైసీపీ అడ్డగోలు ఆరోపణలపై విరుచుకుపడ్డ టీడీపీ**

**నెల్లూరు ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో వైసీపీ సభ్యుల అసత్య ప్రచారాన్ని టీడీపీ కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, జమీర్,కరిముల్లా,మాల్యాద్రి, రామకృష్ణ,డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ లు సమర్థవంతంగా తిప్పికొట్టారు. కౌన్సిల్ అజెండాలోని 116వ అంశంపై వైసీపీ కార్పొరేటర్లు ఉద్దేశపూర్వకంగా ఆందోళనకు దిగడంపై తీవ్రంగా మండిపడ్డారు. భూకబ్జాదారులే కబ్జా అని మాట్లాడటం దొంగే దొంగా దొంగా అని అరిచినట్టుందని ఎద్దేవా చేశారు.నిరుపయోగంగా ఉన్న 0.40 సెంట్ల కాలువ పోరంబోకు భూమి విషయంలో నిబంధనలకు లోబడే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. ఎలాంటి అవరోధం కలగకుండా నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు 1.55 ఎకరాల తమ సొంత పట్టా భూమిలో ప్రత్యామ్నాయ కాలువ మార్గాన్ని ఏర్పాటు చేశారని, తద్వారా నీటి ప్రవాహానికి గానీ రైతులకు గానీ ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ జి.ఓ.యంయస్ 571 ప్రకారం మార్కెట్ విలువ చెల్లించి 0.40 సెంట్ల కాలువ పొరంబోకు స్థలం పొందేందుకే అభ్యర్థించారని వివరించారు.పారదర్శకంగా నిబంధనల మేరకే సదరు అజెండా అంశానికి కౌన్సిల్ ఆమోదం తెలిపిందని స్పష్టం చేశారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంస్కృతి కళాశాల విద్యార్థులు ఎంపిక.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 13 అనంత జన శక్తి న్యూస్.**

అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థుల ఎంపిక అయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హిందూపురము లోనిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 కబడ్డీ పోటీలలో సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు.కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్. సంజయ్ , సి. నరేష్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో ఆగస్టు 24 నుండి 27, వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. హేమచంద్ర, డీన్ అకాడెమిక్స్ ప్రొఫెసర్ డి. నాగరాజు ఫిజికల్ డైరెక్టర్ తలారి రాము విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# పుట్టపర్తిలో ఘనంగా "హర్ ఘర్ తిరంగా" ర్యాలీ

**- దేశభక్తి నినాదాలతో మార్మోగిన పుట్టపర్తి వీధులు**

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**

**పుట్టపర్తి,ఆగస్టు,13:అనంత జనశక్తి న్యూస్**

దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ర్యాలీలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్డీఓ సువర్ణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజా బేగం , ఐసిడిఎస్ పిడి ప్రమీల,డిఆర్డిఎ పిడి నరసయ్య తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ర్యాలీ ప్రారంభం నుంచి ముగింపు వరకు దేశభక్తి, జాతీయ భావం ఉట్టిపడేలా సాగింది. చిన్నారులు, విద్యార్థులు చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకుని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మధ్యలో విద్యార్థులు, చిన్నారులు "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" వంటి దేశభక్తి నినాదాలతో పుట్టపర్తి ప్రధాన వీధులను మార్మోగించారు. వారి ఉత్సాహం, దేశభక్తి ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ జాతీయ స్ఫూర్తిని నింపింది.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడంతో పాటు, జాతీయ జెండా పట్ల గౌరవం, జాతీయ ఐక్యత, దేశ సమగ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీ ముగిసిన అనంతరం పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు మరియు ఇతరులు కలిసి "హర్ ఘర్ తిరంగా" ప్రతిజ్ఞను స్వీకరించారు. జాతీయ పతాక గౌరవాన్ని కాపాడుతూ, దేశ ఐక్యత మరియు సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి

ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా "ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం - ప్రతి హృదయంలో దేశభక్తి" అనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అధికారులు, విద్యార్థులు, చిన్నారులు సమన్వయంతో నిర్వహించిన ఈ ర్యాలీ పుట్టపర్తిలో దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది.

# జాతీయ వినియోగదారుల సదస్సుకు జాయింట్ కలెక్టర్‌కు ఆహ్వానం



**పుట్టపర్తి,ఆగస్టు,13:అనంత జనశక్తి న్యూస్**

రాబోయే సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తి వేదికగా నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గారికి ఆహ్వానం అందింది. గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (CAPCO) చైర్మన్ జి. సురేష్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం జాయింట్ కలెక్టర్‌ను కలసి ఆహ్వాన పత్రికను అందజేసింది.
రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (CAPCO), జాతీయ వినియోగదారుల సంఘాల సమాఖ్య (CCC)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి గారిని కలిసిన ప్రతినిధులు, ఆయనను కూడా సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి సదస్సుకు పౌర సరఫరాల శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, నాణ్యతా ప్రమాణాలు మరియు వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై దేశవ్యాప్తంగా చైతన్యం తేవడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ అన్నదాత రామిరెడ్డి, CAPCO సభ్యులు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పళ్లెం జనార్ధన్, ధర్మవరం మండల జనరల్ సెక్రటరీ గుర్రం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు యజ్జన్న, బుక్కపట్నం మండల అధ్యక్షులు ఎం. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, సభ్యులు ఆవుల విష్ణు, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో సజావుగా అంగన్వాడీల ఇంటర్వ్యూలు

**- ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు**

**ధర్మవరం ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో అంగన్వాడీ ఆయాల ఎంపికకు సంబంధించి ఇంటర్వ్యూలు గురువారం నిర్వహించారు. ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఐసీడీఎస్ శాఖ శ్రీ సత్యసాయి జిల్లా పీడీ కటారి ప్రమీల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ధర్మవరం సీడీపీఓ శైలజ, చెన్నేకొత్తపల్లి సీడీపీఓ కవిత, బత్తలపల్లి సీడీపీఓ సరస్వతి సమక్షంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఇంటర్వ్యూ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని పీడీ ప్రమీల ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన జాబితా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కు పంపి, ఆయన ఆమోదం పొందిన వెంటనే త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల వెల్లడించారు.ఆయా ప్రాజెక్టుల పరిధిలోని సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



# త్రివర్ణ పతాకంతో దేశభక్తి స్ఫూర్తిని చాటాలి..



**గాండ్లపెంట, ఆగస్ట్,13, అనంత జనశక్తి న్యూస్,**

జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు త్రివర్ణ పతాకాలను ఎగురవేసే కార్యక్రమంలో భాగంగా గురువారం గాండ్లపెంట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరసింహులు జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి దేశభక్తిని చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తహసీల్దార్ నరసింహులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మూడు రోజుల పాటు జాతీయ త్రివర్ణ పతాకాలను ఎగురవేయడం జరుగుతుందని తెలిపారు. జాతీయ పతాకం దేశ గౌరవానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, దేశ సమగ్రతను కాపాడుతూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు
మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావనలను మరింత పెంపొందించాలన్నదే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశం పట్ల తమ బాధ్యతను గుర్తించుకోవాలని నరసింహులు కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకానికి పూర్తి గౌరవం కల్పిస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు అధికారులు, ఉద్యోగులు, ప్రజలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని చాటాలని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ నరసింహులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ బాబురావు, వీఆర్వోలు చంద్రశేఖర్ తదితర రెవెన్యూ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో నిడదవోలును అభివృద్ధి పథంలో నిలుపుతాం

**- ఉండ్రాజవరంలో ఘనంగా 'తిరంగా ర్యాలీ'.. పాల్గొన్న మంత్రి దుర్గేష్**

**నిడదవోలు ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. గురువారం ఉండ్రాజవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో పర్యాటక రంగంలో రూ. 20,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, 117 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. పర్యాటక మంత్రిగా వచ్చిన అవకాశంతో నిడదవోలును 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు'లో చేర్చామని, ప్రసిద్ధ కోట సత్తెమ్మ తల్లి ఆలయంలో భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న



రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో చర్చించానని, త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రాబోతున్న స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**ఉండ్రాజవరంలో ఉత్సాహంగా 'తిరంగా ర్యాలీ'..ప్రజానీకానికి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్**

**సమావేశానికి ముందు ఉండ్రాజవరం చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్‌కు స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన 'తిరంగా ర్యాలీ'లో మంత్రి దుర్గేష్ చేతిలో జాతీయ జెండా చేతబూని "భారత్ మాతాకీ జై" అంటూ స్థానిక వీధుల్లో ప్రజలు, నాయకులతో కలిసి నడిచారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు ప్రత్యేకించి నిడదవోలు నియోజకవర్గ ప్రజలందరికీ మంత్రి దుర్గేష్ 80వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. మహనీయుల త్యాగఫలాలను నేటి సమాజానికి, అన్ని వర్గాల ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ 2047', ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.**
**తనకు అప్పగించిన పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలకు బాధ్యతాయుతంగా న్యాయం చేస్తూ, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిర్విరామంగా కృషి చే స్తానని పునరుద్ఘాటించారు.**

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలి



**- పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత సమీక్ష సమావేశం**

**పెనుకొండ ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల ముఖ్య నాయకులు, మండల అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, త్వరలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం కొన సాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చని మంత్రి సవిత పేర్కొన్నారు.

# వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ 'అక్రమార్కుల కమిషన్'గా మారింది



**-మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

వైసీపీ ఐదేళ్ల హయాంలో ఏపీపీఎస్సీ అంటే 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' లా కాకుండా 'అక్రమార్కులకు ఆలవాలమైన కమిషన్' గా మారిపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్1 నియామకాల స్కామ్, కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన 'మెగా డీఎస్సీ' తదితర అంశాలపై మీడియాకు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. గత వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్1 నియామకాల అక్రమాలపై 'సిట్' అందించిన 132 పేజీల నివేదిక ఆ పార్టీ అరాచక పాలనకు, పాపాలకు నిలువెత్తు సాక్ష్యమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా మూడుసార్లు రీవాల్యుయేషన్ చేసి, 95 శాతం జవాబు పత్రాలపై వైట్ నర్లు రుద్ది, అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తూ తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని మండిపడ్డారు. పదో తరగతి, ఇంటర్ చదివిన సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలను దిద్దించి ఏపీపీఎస్సీ పవిత్రతను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. డీఎస్సీలో ఉద్యోగం రాని నిరుద్యోగులు నిరాశ చెందవద్దని, ఈ ఏడాది అక్టోబర్‌లోనే మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రికార్డు స్థాయిలో కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయని వైసీపీ నాయకులు చేసే విషప్రచారాలను నిరుద్యోగులు నమ్మవద్దని, రాబోయే డీఎస్సీకి శ్రద్ధగా సిద్ధం కావాలని హితవు చెప్పారు. ప్రభుత్వంపై బురదజల్లే దొంగ నాటకాలు మాని, ధైర్యముంటే శాసన సభకు వచ్చి డీఎస్సీపై చర్చించాలని, సమాధానం చెప్పేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక మార్పులతో వేలాది ఉద్యోగాలు ఇస్తుంటే, ఆయన రాజీనామా డిమాండ్ చేయడం గురివింద గింజ సామెతను గుర్తు చేస్తోందన్నారు.

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని డబల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.చనిపోయిన వారిని పరామర్శించకుండా ఆస్తుల విధ్వంసమే ధ్యేయంగా రాజకీయం చేస్తున్న వైసీపీకి రాబోయే రోజుల్లో ప్రజలు సింగిల్ డిజిట్‌కే పరిమితం చేయడం ఖాయమని హెచ్చరించారు.

# పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే ఎమ్మెల్యే కన్నా సంపాదించుకున్న అసలైన ఆస్తి

**- నియోజకవర్గాలు మారాయి.. కాలం మారింది.. కానీ కన్నాపై ప్రజల అభిమానం మారలేదు**
**- యువ రాజకీయ నాయకత్వానికి కన్నా లక్ష్మీనారాయణ జీవితం ఒక స్ఫూర్తి**
**-ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం**
**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**గుంటూరు, ఆగస్ట్ 13:అనంత జనశక్తి న్యూస్**

సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్యే ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం సాధారణ విషయం కాదని, సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ జీవితం నేటి యువ నాయకత్వానికి ఒక స్ఫూర్తిదాయక పాఠమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరులో కన్నా లక్ష్మీనారాయణ 50 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం – రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు ఆయనకు తన తరపున, కూటమి పార్టీల తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానం అంటే సాధారణ విషయం కాదు. ఒక ఎన్నిక గెలవడం గొప్ప విషయం కావచ్చు. కానీ ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్య ఉండి, వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం అసాధారణమైన విషయం. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన కన్నా లక్ష్మీనారాయణ ప్రయాణం గుంటూరు జిల్లా యూత్ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించే స్థాయికి ఎదిగింది" అని



కొనియాడారు.1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు నుంచి, 2009లో గుంటూరు వెస్ట్ నుంచి, 2024లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం కన్నా లక్ష్మీనారాయణపై ప్రజలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. 'నియోజకవర్గాలు మారాయి... కాలం మారింది... రాజకీయ పరిస్థితులు మారాయి... కానీ కన్నాపై ప్రజల అభిమానం మాత్రం మారలేదు. అదే ఆయన నిజమైన రాజకీయ బలం అని అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రిగా పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్, గృహ నిర్మాణం, వ్యవసాయం వంటి కీలక శాఖలను నిర్వహించి కన్నా లక్ష్మీనారాయణ తనదైన ముద్ర వేశారని తెలిపారు. 2018–2020 మధ్య రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా పార్టీకి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎన్నో పదవులు నిర్వహించినప్పటికీ ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధమే కన్నా లక్ష్మీనారాయణను ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టిందన్నారు."కన్నా రాజకీయ జీవితాన్ని చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. రాజకీయమంటే పదవి కాదు... బాధ్యత. రాజకీయమంటే అధికారం కాదు... ప్రజాసేవ. రాజకీయమంటే ఐదేళ్ల ప్రయాణం కాదు... జీవితకాల నిబద్ధత. ఆయన సంపాదించుకున్న అసలైన ఆస్తి పదవులు కాదు... ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం, ప్రజలతో ఏర్పడిన ఆత్మీయ బంధం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ స్వర్ణోత్సవం ఒక వ్యక్తికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, ప్రజాజీవితంలోకి రావాలనుకునే ప్రతి యువ నాయకుడికి ఆయన ప్రస్థానం ఒక స్ఫూర్తి అని అన్నారు. "ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం. కన్నా గారూ... మీరు 50 ఏళ్ల రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. కానీ ఇది ముగింపు కాదు... మరో కొత్త అధ్యాయానికి ప్రారంభం కావాలి. మీ అనుభవం రాష్ట్రానికి, మీ రాజకీయ పరిజ్ఞానం యువ నాయకత్వానికి మరింత ఉపయోగపడాలి" అని ఆకాంక్షించారు. కన్నా లక్ష్మీనారాయణ నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండి, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. "జన నాయకుడు కన్నా 50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ ప్రస్థానానికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ప్రజాసేవా ప్రస్థానం చిరస్థాయిగా కొనసాగాలి" అంటూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీని,జయప్రదం,చేయండి

**- ఎంపీడీవో ఎం శకుంతల,**

**అమడగూరు ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు మండల కేంద్రంలోని హర్ ఘర్, తిరంగా కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 10, 30,గంటలకు జడ్. పి.హెచ్.ఎస్, పాఠశాల నుండి బస్టాండ్ వరకు 80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా, జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించబడునని జాతీయ ఐక్యతను దేశభక్తిని చాటి చెప్పేలా ఈ ర్యాలీ సాగుతుందని కాబట్టిఅమడగూరు మండల మండల్ లెవెల్ ఆఫీసర్స్ ప్రజలు ప్రజా ప్రతినిధులు నాయకులు యువకులు ఉపాధ్యాయులు విద్యార్థులు మండల స్థాయి ఉద్యోగులు స్వచ్ఛంద,సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎంపీడీవో, మరియు తాసిల్దార్, ఎంఈఓ, తెలియజేశారు



# ఆందోళన వద్దు ...

**- అర్హులందరికీ 'నేతన్నల సేవలో..' అందిస్తాం**
**- కొత్త దరఖాస్తుదారులకు ఈనెల 20లోగా ఆర్థిక సాయం**
**- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**అమరావతి ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**

నేతన్నల సేవలో పథకం కింద అర్హులందరికీ ఆర్థిక సాయం అందిస్తామని, సాంకేతిక కారణాల రీత్యా కొందరికి ఇంకా నగదు జమ కాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు నేతన్నల సేవలో పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే పలువురు నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన వారికి కూడా ఆర్థిక సాయం అందజేస్తామని, అర్హులైన నేతన్నలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సవిత భరోసా ఇచ్చారు. ఇటీవల వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వారికి ఈ నెల 20వ తేదీలోగా ఆర్థిక సాయం అందిస్తామని వెల్ల డించారు. చేనేతల సంక్షేమం కోరే ప్రభుత్వం తమదని స్పష్టంచేశారు. అర్హులైన నేతన్నల కుటుంబాల్లో ఆనందం చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. వదంతులు, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే సమీపంలో చేనేత, జౌళి శాఖాధికారులను సంప్రదించాలని మంత్రి సవిత సూచించారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి

**– ఎంపిడిఓ అశోక్ కుమార్ రెడ్డి**

**నల్లచెరువు ఆగస్టు 13 అనంత జనశక్తి న్యూస్**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు జడ్పీ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించబడునని
జాతీయ ఐక్యతను దేశభక్తిని చాటిచెప్పేలా ఈ ర్యాలీ సాగుతుందని కాబట్టి నల్లచెరువు మండల ప్రజలు ప్రజా ప్రతినిధులు నాయకులు,పత్రికా విలేకరులు యువకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు మండలస్తాయి ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.
ఎంపీడీఓ తహసీల్దార్ ఎం ఈ వో నల్లచెరువు

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపిక



**- ధర్మవరం రైల్వే వాలీబాల్ ఆర్గనైజర్ జింకల రాజన్న, కోచ్ సుబ్రహ్మణ్యం.**

**ధర్మవరం, ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్:**

హిందూపురం లోని బసవన్నపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి షాప్ వాలీబాల్ పోటీల్లో ధర్మవరం జట్టు సత్తా చాటింది. హిందూపురం జట్టుతో హోరాహోరీగా తలపడిన ధర్మవరం జట్టు ఫైనల్లో రన్నరప్‌గా నిలిచింది.ధర్మవరం జట్టులో ప్రతిభ కనబరిచిన సాయి రిషిక్, విష్ణు, పండు అనే ముగ్గురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఆర్గనైజర్ జింకల రాజన్న తెలిపారు. జిల్లా స్థాయిలో అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్న వీరు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.
రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను కోచ్ సుబ్రహ్మణ్యం, వాలీబాల్ కమిటీ సభ్యులు రియాజ్, బాబా ఫక్రుద్దీన్, ప్రకాష్, చాంద్ భాషా అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ధర్మవరం క్రీడా రంగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# బొటానిక్ గార్డెన్‌లో మొక్కల ప్రవర్ధనపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన




**అనంతపురం, ఆగస్టు 13:అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (SKU) బొటానిక్ గార్డెన్ నర్సరీలను పీవీకేకే పీజీ కళాశాల బోటనీ విభాగానికి చెందిన 10 మంది మాస్టర్ డిగ్రీ విద్యార్థులు గురువారం సందర్శించారు. అధ్యాపకులు జి. మహాలక్ష్మి, బి. సుస్మిత విద్యార్థులతో కలిసి ఈ పర్యటనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా SKU బొటానిక్ గార్డెన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రవర్ధన పద్ధతులను వివరించారు. నెట్ హౌస్‌లు, ఓపెన్ నర్సరీలను సందర్శించిన విద్యార్థులు మొక్కల పెంపకంలో ఉపయోగిస్తున్న పరికరాలు, సాంకేతిక విధానాలను పరిశీలించారు.అనంతరం వర్మీ కంపోస్ట్ యూనిట్, ఎరువుల గుంతలను సందర్శించి సేంద్రియ ఎరువులు, వర్మీకంపోస్ట్ వినియోగంపై అవగాహన పొందారు. బొటానిక్ గార్డెన్‌లో సంరక్షిస్తున్న స్థానిక, అంతరించిపోతున్న మొక్కలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పర్యటనతో మొక్కల ప్రవర్ధన, నర్సరీ నిర్వహణ, జీవ వైవిధ్య పరిరక్షణపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కలిగిందని ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా ప్రతి ఒక్కరి బాధ్యత :




**ఎంపీపీ తడబారికి మితుల**

**అనంతగిరి,అనంత జన శక్తి న్యూస్,ఆగస్టు 13:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడబారికి మితుల, జడ్పీటీసీ దీసారి గంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.ఈ సందర్భంగా ఎంపీపీ మితుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, ఏఓ సాయి, సీనియర్ అసిస్టెంట్ రాంబాబుతో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ కొండయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పల్లె



**- డాక్టర్ కొండయ్య మృతి అత్యంత బాధాకరం**

**- కొండయ్య నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

**అనంతపురం ఆగస్ట్ 13 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు.డాక్టర్ కొండయ్య మృతి పట్ల మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో డాక్టర్ కొండయ్య అందించిన సేవలు అభినందనీయమని, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సమాజానికి తీరని లోటని అన్నారు.డాక్టర్ కొండయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, డాక్టర్ కొండయ్య ఆత్మకు శాంతి చేకూరాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆకాంక్షించారు. మాజీ మంత్రి తో పాటు పలువురు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# మహిళలకు రూ.50,000



**- సంచలన నిర్ణయం దిశగా యోగి సర్కార్**

**- ఎన్నిలక ముందు బీజేపీ వరాల జల్లు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**

ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ తన పథకాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం మహిళలకు రూ. 50,000 వరకు ఆర్థిక సాయం అందించాలని యోచిస్తోంది. అయితే, ఈ మొత్తాన్ని ఒకేసారి నగదు రూపంలో ఇవ్వాలా? లేక ఇప్పటికే అమలులో ఉన్న మహిళా సంక్షేమ పథకాలను విస్తరించి వివిధ రూపాల్లో ప్రయోజనం కల్పించాలనా? అనే ఆలోచన చేస్తోంది. అర్హత కలిగిన మహిళల బ్యాంకు ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా నగదు జమ చేయాలనే ఒక ప్రతిపాదన ఉంది. మరో మార్గంగా విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం అందించే అంశాన్ని పరిశీలిస్తోంది. రూ. 50,000 మొత్తాన్ని ఒకేసారి నగదు రూపంలో ఇవ్వకుండా, ఇప్పటికే అమలులో ఉన్న మహిళా సంక్షేమ పథకాలను మరింత విస్తరించే అవకాశం కూడా ఉంది.

యూపీలో అమలు అవుతున్న మహిళా సంక్షేమ పథకాలు ఇవే:

ముఖ్యమంత్రి కన్యా సుమంగళ యోజన: పుట్టుక నుంచి విద్యలో వివిధ దశలు, గ్రాడ్యుయేషన్ వరకు అర్హత కలిగిన బాలికలకు మొత్తం రూ.15,000 వరకు ఆర్థిక సాయం.

*రాణి లక్ష్మీబాయి స్కూటీ యోజన: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతిభావంతులైన విద్యార్థినులకు స్కూటర్లు అందించే లక్ష్యంతో ఉన్న పథకం.

*నిరాశ్రిత మహిళా పెన్షన్ యోజన: అర్హత కలిగిన నిరాశ్రయ మహిళలు, వితంతువులకు జీవనోపాధి కోసం ప్రతి మూడు నెలలకు రూ.3,000 సాయం.

*రాణి లక్ష్మీబాయి మహిళా ఏవం బాల్ సమ్మాన్ కోష్: యాసిడ్ దాడులు సహా తీవ్రమైన హింసకు గురైన మహిళలు, పిల్లలకు చికిత్స, పునరావాసం కోసం ఆర్థిక సాయం.

*ముఖ్యమంత్రి సామూహిక వివాహ యోజన: పేద, నిరాశ్రయ కుటుంబాల కుమార్తెలు, వితంతు మహిళల కుమార్తెల వివాహాలకు ఆర్థిక సహాయం.

*స్వయం సహాయక సంఘాలు, లఖ్‌పతి దీదీ: మహిళలను స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, జీవనోపాధి అవకాశాలతో అనుసంధానించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం.

*యూపీ రోడ్‌వేస్ ఉచిత ప్రయాణం: 60 ఏళ్లు పైబడిన మహిళలకు ఉత్తరప్రదేశ్ రోడ్‌వేస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం.

# బంగ్లాదేశ్‌లో తీవ్ర విద్యుత్ సంక్షోభం

**- భారత్ సాయం కోసం ఎదురుచూపు**

**- గ్రామీణ ప్రాంతాల్లో 8–16 గంటల వరకు కోతలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**



బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ సంక్షోభంతో అల్లాడుతోంది. దేశవ్యాప్తంగా 1016 గంటల పాటు విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. విద్యుత్ కోతల కారణంగా దేశవ్యాప్తంగా దుకాణాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్‌స్‌ను రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలని ప్రభుత్వం కొత్త నిబంధనల్ని అమలు చేస్తోంది. విద్యుత్ కొరత కారణంగా ఇకపై బంగ్లాదేశ్‌లోని దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటున్నాయి. దేశంలోని అన్ని బిల్ బోర్డులను సాయంత్రం 7 గంటల లోపు ఆపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని డెకరేషన్ లైట్లు కూడా పూర్తిగా నిలిపేయాలని చెప్పింది. బంగ్లాదేశ్ విద్యుత్, ఇంధన మరియు ఖనిజ వనరుల మంత్రిత్వ శాఖ బుధవారం సాయంత్రం జారీ చేసిన ఒక ఉత్తర్వులో ఈ నిర్ణయాలను ప్రకటించింది.

**విద్యుత్ కొరత ఎందుకు?**

బంగ్లాదేశ్‌కు వచ్చే ఇంధనం దాదాపుగా గల్ఫ్ దేశాల నుంచే వస్తోంది. ఇరాన్‌అమెరికా యుద్ధం వల్ల హోర్ముజ్ జలసంధి మూతపడింది. బంగ్లాదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి గ్యాస్‌పై ఆధారపడి ఉంది. గ్యాస్ కొరత కారణంగా విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు భారత్ గతంలో 5000 మెట్రిక్ టన్నుల డీజిల్ పంపింది. కొన్నాళ్ల పాటు ఈ సాయంతో నెట్టుకొచ్చింది. 33092 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం ఉన్నప్పటికీ, ఇంధన కొరత కారణంగా అందులో సగభాగాన్ని మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతోంది.

భారత సాయం కోసం బంగ్లా చూపు..

సంక్షోభాన్ని అధిగమించడానికి బంగ్లాదేశ్ భారత్‌ను కోరింది. గత వారం గత వారం భారత హైకమిషనర్ దినేశ్ త్రివేదితో బంగ్లాదేశ్ ఇంధన మంత్రి ఇక్బాల్ హసన్ మహ్మూద్ సమావేశమైన సందర్భంగా ఈ అభ్యర్థన చేశారు.భారత్ నుంచి డీజిల్ సరఫరా కోసం ఇప్పటికే పైప్‌లైన్ ఉందని, దాని ద్వారా మరింత డీజిల్ అందించాలని మంత్రి కోరారు. ఇండియా-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ 2017లో షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభమైంది. బంగ్లాదేశ్ ఇంధన భద్రతలో ఈ పైప్‌లైన్ కీలక పాత్ర పోషిస్తోంది. 15 ఏళ్ల ఒప్పందం ప్రకారం భారత్ ప్రతి సంవత్సరం 1,80,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను ఢాకాకు పంపాల్సి ఉంది. మిడిల్ ఈస్ట్ సంక్షోభం సమయంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో భారత్ ఇప్పటికే 30,000 టన్నులకు పైగా డీజిల్‌ను బంగ్లాదేశ్‌కు పంపింది.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

**- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి**

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం ఆగస్ట్ 13 అనంత జనశక్తి న్యూస్**



80,వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14 ,వ తేదీ ఉదయం 8:00 గంటలకు అనంతపురం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, పుర ప్రముఖులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, క్రీడాకారులు,విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఓ .ఆనంద్ కలెక్టర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు .ఈ ర్యాలీలో ప్రజలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు, పాల్గొని పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని మండల , గ్రామ వార్డు స్థాయిలలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని మండల స్థాయి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలను చేత బూని దేశభక్తిని చాటాలని అలాగే అన్ని వర్గాల ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు. అపార్ట్మెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, షాపులు తదితర ప్రాంతాల్లోని ప్రజలు వారి వారి ఆవాసాలపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. దీనికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు జిల్లా కంట్రోల్ రూమ్ తో పాటు నోడల్ ఆఫీసర్ ఈమెయిల్ (anantapur. apta@gmail.com కు పంపాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్ నందు ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా ఆయా కార్యక్రమాలను పై తెలిపిన విధంగా పంపాల్సి ఉంటుందన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారులు వారి కింది స్థాయి సిబ్బందికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు తెలియజేసి పలు సూచనలు సలహాలు ఇచ్చి హర్ హర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.,

# పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ (పరిచయ కార్యక్రమం)



**అనంతపురం ఆగస్టు 13, అనంత జనశక్తి న్యూస్**

పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురంలో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ (పరిచయ కార్యక్రమం) గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక విద్యలో క్రమశిక్షణతో కూడిన ప్రామాణిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, అవసరమైన సౌకర్యాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు.కళాశాల చైర్మన్ డా. కిషోర్ పల్లె మాట్లాడుతూ, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు బీటెక్ విద్యను కేవలం డిగ్రీగా కాకుండా తమ భవిష్యత్‌కు బలమైన పునాదిగా భావించాలని సూచించారు. మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్‌బాబు, డీన్ డా. సంతోష్ కుమార్ రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డా. లక్ష్మీ నరసప్ప, అధ్యాపకులు, సిబ్బంది, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన నూతన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరణాలను 70 %వరకు తగ్గించగలిగాం

(మొదటి పేజీ తరువాయి)




పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో మానవఏనుగు సంఘర్షణ సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటకతో కలిసి చర్యలు చేపట్టాం. కర్ణాటక నుంచి నాలుగు కుంకీలను తీసుకువచ్చి ముసలివాగులో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. కుంకీల సహాయంతో 50కి పైగా సంఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, ఏనుగుల వల్ల జరిగే మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగాం. రాష్ట్ర ప్రభుత్వం 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలు, ఏడు వన్యప్రాణుల అంబులెన్స్‌లను ఏర్పాటుచేసింది. వీటిద్వారా 200కు పైగా వన్యప్రాణులను రక్షించగా, 30కుపైగా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. ఏనుగుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఉద్యమంగా మారాలి'' పవన్ పిలుపునిచ్చారు.

**ఏపీలో 132 నుంచి 142 అడవి ఏనుగులు..**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 132 నుంచి 142 అడవి ఏనుగులు ఉన్నాయని పవన్ కల్యాణ్ వెల్లడించారు. వాటి సంరక్షణ మనకు గర్వకారణమే కాకుండా బాధ్యత కూడా అని తెలిపారు. మనిషి - ఏనుగు ఘర్షణలను తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అటవీ శాఖల మధ్య సహకారం కొనసాగుతోందని తెలిపారు. కర్ణాటక అటవీ శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు కుంకీ ఏనుగులు అందాయని ప్రస్తావించారు. వాటి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కుంకీ ఏనుగుల సహాయంతో ఇప్పటికే 15 మనిషి - ఏనుగు ఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించామని వెల్లడించారు. దీంతో ఏనుగుల కారణంగా జరిగే మానవ ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మనిషి - వన్యప్రాణుల ఘర్షణల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.

**వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలు..**

వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించామని చెప్పారు. రైతులకు సకాలంలో హెచ్చరికలు అందించడం, అటవీ సిబ్బందికి ఆధునిక పరికరాలు, శిక్షణ కల్పించడం, వన్యప్రాణులకు సురక్షితమైన ఆవాసాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యాలని వ్యాఖ్యానించారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదని.. ప్రజలను భాగస్వామ్యం చేసి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఏనుగుల సంరక్షణపై దేశవ్యాప్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో 21,450 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారి ఉత్సాహం, చైతన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు. అభివృద్ధికి బాధ్యత ఉండాలి, సంరక్షణకు లక్ష్యం ఉండాలని తెలిపారు. వన్యప్రాణులను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# తొలి వేతనాన్ని అమరవీరుల కుటుంబాలకు

**- ఎంపీ -చింతకాయల విజయ్**

**- నూతనంగా రాజ్యసభ ఎంపీగా విజయ్**

**- 3 లక్షల చెక్కును రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 13, అనంత జనశక్తి న్యూస్**



దేశాన్ని కాపాడటం కోసం అమరులైన జవాన్ల కుటుంబాలకు ఎంపీ చింతకాలయ విజయ్ అండగా నిలిచారు. ఏపీ నుంచి ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన చింతకాలయ విజయ్ తన మొదటి జీతాన్ని అమరవీరుల కుటుంబాలకు అందించాలని నిర్ణయించారు. తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. విరాళంగా అందించిన ఆ చెక్కును భారత రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు అందజేశారు.

దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తనవంతు సాయంగా తన మొదటి జీతాన్ని అమరవీరుల కుటుంబాలకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పదవి చేపట్టిన వెంటనే తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించడంతో విజయ్‌ను పలువురు నెటిజన్లు ప్రశంసించారు.

**అమరావతి పేరును మారవడంపై విమర్శలు**

రాజ్యాంగ విలువలు తెలియని వ్యక్తి, అమరావతి పేరును మావిగన్‌గా మార్చాలి అనుకుంటున్నారని టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ రాజ్యసభలో వ్యాఖ్యలు చేశారు. కేరళ పేరును కేరళంగా మార్చి కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించింది. ఇదివరకు అమరావతి బిల్లును పాస్ చేసి చట్టబద్ధత కల్పించిందని.. కానీ ఇప్పుడు ఆపేరును మావిగన్‌గా మారుస్తాను అనడంపై ఆయన విమర్శలు చేశారు. పార్లమెంట్ ఒకసారి బిల్లు పాస్ చేసిన తర్వాత దానికి వ్యతిరేకంగా ఎవరూ వెళ్లడానికి వీల్లేదని, కానీ రాజ్యాంగం విలువలపై నమ్మకం లేని వారు దానికి వ్యతిరేకంగా మాట్లాడతారని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఉత్తమ ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థుల ఫొటోలను పత్రికల మొదటి పేజీల్లో ప్రచురించడాన్ని ఆయన రాజ్యసభలో ప్రశంసించారు. పేద విద్యార్థుల విజయగాథలను పత్రికల మొదటి పేజీల్లో ప్రకటనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పథకాన్ని ప్రారంభించాలని రాజ్యసభ జీరో అవర్‌లో ప్రస్తావించారు.

# హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకుని జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని, అందుకోసమే స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సూచించారు. కొందరు 'SIR' పేరుతో ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, బెంగాల్‌లో లాగా తెలంగాణలో కూడా గెలుస్తామని మాట్లాడుతున్నారని హెచ్చరించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా ఒక రేవంత్ రెడ్డిగా మారి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.

**మీరు కొనుక్కున్న భూమి ఎక్కడికీ పోదు: రేవంత్**



ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి KPHB కాలనీలో ప్రసంగిస్తూ ఇళ్ల నిర్మాణం, భూక్రమబద్ధీకరణపై ప్రజలకు హామీ ఇచ్చారు. భూమికి సంబంధించిన డబ్బులు ఏమీ తీసుకోవడం లేదని, ఇల్లు పూర్తయిన తర్వాత మాత్రమే రూ. 5 లక్షలు చెల్లించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా మినహాయిస్తున్నట్లు ప్రకటించారు. 22A నిబంధనల కింద ఉన్న భూములకు తనదే పూర్తి భరోసా అని, కోర్టు కేసులు ఉన్నవి మినహా మిగిలిన భూములన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయిస్తానని సీఎం హామీ ఇచ్చారు. ంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కూకట్‌పల్లిని ప్రత్యేకంగా చూసి అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. పైసా ఖర్చు లేకుండా తనను ఎంపీగా గెలిపించిన కూకట్‌పల్లి ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే హౌసింగ్ బోర్డు కాలనీలు నిర్మితమయ్యాయని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించిన ఆయన.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఊరవతల ఇళ్లు కట్టి ప్రజలను ఉపాధికి దూరం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్ల కేసీఆర్ పాలనకు, తమ ప్రభుత్వం పూర్తి చేసిన పనులకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు గానూ తమ ప్రభుత్వం నెలకు రూ. 7 వేల కోట్లు వడ్డీలు కడుతోందని వెల్లడించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరలు, సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు పాలనా సేవలు ఇబ్బంది లేకుండా GHMCని మూడు భాగాలుగా విభజించామని చెప్పారు. సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి ఒడుదొడుకులు ఎదురైనా ఎదుర్కొంటానని, ప్రజలు అండగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# ఐవీఎఫ్ వర్సెస్ ఐయూఐ తేడాలు, ప్రయోజనాలు



పిల్లల కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నా ఫలితం లేదా? అలాంటి వారికి ఇంట్రాటెరిన్ ఇన్‌సెమినేషన్ లేదా ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ అనే రెండు పునరుత్పత్తి సహాయక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇవి గర్భం ధరించే ప్రక్రియను సులభతరం చేయడానికి ఉద్దేశించినవి అయినప్పటికీ, రెండింటికీ వేర్వేరు ప్రయోజనాలు, ఇబ్బందులూ ఉన్నాయి. మీ ప్రత్యేక పరిస్థితులకు ఏది సరిపోతుందో వైద్యులు మీకు సలహా ఇస్తారు.



"గర్భం ధరించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తులు, దంపతులకు, ఇంట్రాటెరిన్ ఇన్‌సెమినేషన్ , ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ అనేవి రెండు సాధారణ సహాయక పునరుత్పత్తి సాంకేతికతలు" అని ఆమె చెప్పారు. "రెండూ గర్భధారణ అవకాశాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటి ప్రక్రియ, క్లిష్టత, ఖర్చు, ఎవరికి సరైనవి అనే విషయాలలో గణనీయంగా తేడా ఉంటాయి"

**ఐయూఐ అంటే ఏమిటి?**

ఐవీఎఫ్ కంటే ఐయూఐ తక్కువ సంక్లిష్టమైనదని, తక్కువ సమయంలో పూర్తయ్యే ప్రక్రియ అని డాక్టర్ సూరి తెలిపారు. "ఐయూఐ అనేది సాపేక్షంగా సరళమైన ప్రక్రియ. ఇక్కడ సిద్ధం చేసిన వీర్యాన్ని అండం విడుదలయ్యే సమయానికి నేరుగా గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియ ఐవీఎఫ్ కంటే తక్కువ సంక్లిష్టమైనది. సాధారణంగా తక్కువ ఖర్చుతో కూడుకున్నది. ఒక్కో సైకిల్‌కు



10-20 శాతం విజయావకాశాలు ఉంటాయి. ఇది వయస్సు, సంతానోత్పత్తి నిర్ధారణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది" అని వివరించారు.

"పురుషుల్లో స్వల్పంగా సంతానలేమి సమస్యలు ఉన్నప్పుడు, లేదా సర్వైకల్ మ్యూకస్ (గర్భాశయ శ్లేష్మం) సమస్యలు ఉన్న సందర్భాలలో ఐయూఐ ఆదర్శవంతమైనది. దీనికి శారీరక, ఆర్థిక భారం తక్కువ కాబట్టి, సాధారణంగా దీనిని మొదటి చికిత్సా పద్ధతిగా పరిగణిస్తారు. అండం విడుదలను ప్రేరేపించడానికి మందులను ఐయూఐతో పాటు ఉపయోగించవచ్చు. అయితే, ఇది కవలలు వంటి బహుళ గర్భధారణల ప్రమాదాన్ని కొద్దిగా పెంచుతుంది" అని డాక్టర్ సూరి తెలిపారు.



**ఐవీఎఫ్ అంటే ఏమిటి?**

దీనికి విరుద్ధంగా, ఐవీఎఫ్ అనేది మరింత సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందులో అండాశయ ప్రేరణ, అండాలను తిరిగి పొందడం, ప్రయోగశాలలో అండాలను ఫలదీకరణం చేయడం, ఆపై పిండాన్ని గర్భాశయంలోకి బదిలీ చేయడం వంటివి ఉంటాయని డాక్టర్ సూరి చెప్పారు.

"అధిక సంతానోత్పత్తి అడ్డంకులు ఉన్నప్పుడు ఐవీఎఫ్ సిఫార్సు చేస్తారు. ఉదాహరణకు, ఫాలోపియన్ ట్యూబులు బ్లాక్ అవ్వడం, ఎండోమెట్రియోసిస్, పురుషులలో తీవ్రమైన సంతానలేమి, వయస్సు పెరగడం లేదా ఐయూఐ యొక్క అనేక సైకిల్స్ విఫలమైనప్పుడు ఐవీఎఫ్‌ను సూచిస్తారు. ఐవీఎఫ్ విజయావకాశాలు గణనీయంగా ఎక్కువగా ఉంటాయి, 35 ఏళ్ల లోపు మహిళలకు ఒక్కో సైకిల్‌కు తరచుగా 40-50 శాతం ఉంటుంది. అయితే వయస్సు పెరిగే కొద్దీ ఈ రేటు తగ్గుతుంది" అని ఆమె వివరించారు.



# వాకింగ్ అల్జీమర్స్ ముప్పును తగ్గిస్తుందని తేల్చిన అధ్యయనం





రోజూ నడవడం ద్వారా జ్ఞాపకశక్తి మందగించే ప్రమాదం తగ్గుతుందని, ముఖ్యంగా జన్యుపంగా అల్జీమర్స్ వ్యాధికి ఆస్కారం ఉన్నవారికి ఇది మరింత ప్రయోజనకరమని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. దాదాపు 3,000 మంది 70 నుండి 79 సంవత్సరాల వయస్సు గలవారిని పదేళ్లపాటు పర్యవేక్షించి ఈ ఫలితాలను వెల్లడించింది. పరిశోధకులు వారి రోజువారీ నడక అలవాట్లను గమనించారు. ఈ అలవాట్లను కొనసాగించడం లేదా పెంచడం వల్ల మెదడు సమాచారాన్ని ప్రాసెస్ చేసే వేగం , కార్యనిర్వాహక పనితీరు మెరుగుపడ్డాయని గుర్తించారు. ఇవి రెండూ మెదడు ఆరోగ్యానికి కీలకమైన అంశాలు.

ఈ అధ్యయనానికి ప్రధాన రచయిత, యూనివర్సిటీ ఆఫ్ కాల్గరీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ సిండి బర్హా, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి నివారించడం ఎంత ముఖ్యమో నొక్కి చెప్పారు. ఎక్కువసేపు కూర్చునే సమయాలను విచ్ఛిన్నం చేయడానికి, రోజంతా చిన్నపాటి నడక సెషన్లను దినచర్యలో చేర్చుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

**అల్జీమర్స్ వ్యాధి అంటే ఏమిటి?**

అల్జీమర్స్ వ్యాధి అనేది ఒక సంక్లిష్టమైన రుగ్మత. దీనిని డిమెన్షియా యొక్క తీవ్రమైన రూపంగా పరిగణిస్తారు. మెదడులో హానికరమైన ఫలకాలు పేరుకుపోవడం దీని ప్రధాన లక్షణం. ఈ ఫలకాలు నరాల కణాల మధ్య కమ్యూనికేషన్‌ను అడ్డుకుంటాయి. చివరికి వాటి మరణానికి దారితీస్తాయి. నరాల కణాలు క్షీణించడంతో, వ్యక్తులు ఈ కింది సమస్యలను ఎదుర్కోవచ్చు..

జ్ఞాపకశక్తి కోల్పోవడం: ఇటీవల జరిగిన సంఘటనలు లేదా వ్యక్తిగత అనుభవాలను గుర్తుంచుకోవడంలో



ఇబ్బంది.

గందరగోళం: ముఖ్యంగా పరిచయమున్న ప్రదేశాలలో దిక్కుతోచని స్థితి.

వ్యక్తిత్వ మార్పులు: ప్రవర్తన లేదా మానసిక స్థితిలో గుర్తించదగిన మార్పులు.

దురదృష్టవశాత్తు, ప్రస్తుతం అల్జీమర్స్ వ్యాధికి చికిత్స లేదు. కాబట్టి నివారణ వ్యూహాలు మరింత ముఖ్యమైనవిగా మారాయి.

**అల్జీమర్స్ వ్యాధిలో జన్యువుల పాత్ర ఏమిటి?**

అల్జీమర్స్ వచ్చే అవకాశంలో జన్యు కారకాలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. "ముఖ్యంగా, APOE4 అని పిలువబడే ఒక జన్యు వైవిధ్యం మెదడు నుండి వ్యాధి సంబంధిత ఫలకాలను తొలగించడం మరింత కష్టతరం చేస్తుంది. సుమారు 15%



నుండి 25% జనాభా ఈ వైవిధ్యాన్ని కలిగి ఉంది. దీనిని జన్యు పరీక్ష ద్వారా మాత్రమే గుర్తించవచ్చు" అని న్యూరాలజిస్ట్ డాక్టర్ నేహా కపూర్ హెల్త్ షాట్స్‌కు తెలిపారు.

**అల్జీమర్స్ మెదడు, శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?**

అధ్యయనం నిర్దిష్ట నడక దినచర్యను సూచించనప్పటికీ, డాక్టర్ బర్హా నిశ్చల జీవనశైలిని కొద్దికొద్దిగా నడవడం ద్వారా విచ్ఛిన్నం చేయడం వల్ల మెదడు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ప్రతిపాదించారు.

**నడకకు సిఫార్సులు:**

తరచుగా: రోజంతా అనేక చిన్న నడక సెషన్లను లక్ష్యంగా పెట్టుకోండి.

స్థిరత్వం: ఏటా స్థిరమైన నడక అలవాటును కొనసాగించండి.





# 'రాకా' ప్రపంచంలో ఎవరెలా?








అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# సుకుమార్ కుమార్తె మరో అరుదైన ఘనత



: 'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్‌క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.

# ఫోన్ వల్లే రూ.3లక్షల ఖర్చు.. నరకయాతన: నటి షకీల



: ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. "ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి" అని షకీల కోరారు.

18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.

# ఆర్సీబీపై ఆ సెంచరీనే నా కెరీర్‌ను నిలబెట్టింది: డేవిడ్ మిల్లర్



తన కెరీర్ నిలబడేందుకు ఐపీఎల్‌లో చేసిన ఓ సెంచరీనే కారణమని దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు విషయాలపై అతడు మాట్లాడాడు. వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌ను గెలిచి ఆటకు వీడ్కోలు పలకాలని ఉందని చెప్పాడు. ఇక ఐపీఎల్‌లో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌ల గురించి ప్రస్తావించాడు.

"రాయల్ ఛాలెంజర్స్ జట్టుపై 2013 ఐపీఎల్ సీజన్‌లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడా. పంజాబ్ కింగ్స్ తరఫున బరిలోకి దిగిన నాకు అదే ఫస్ట్ టీ20 సెంచరీ. చాలా గుర్తింపు తీసుకొచ్చింది. నా కెరీర్‌లో ఒక్కసారిగా ఊపు వచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన ఇన్నింగ్స్ మరిచిపోలేను.. డర్బన్ వేదికగా ఆసీస్ ఛేజింగ్‌లో శతకం కొట్టా. ఇప్పడ నేను చెప్పిన ఆ రెండు సెంచరీలు తీవ్ర ఒత్తిడిలో ఆడినవే. అందుకే, నా దృష్టిలో అవి ఉత్తమం. బ్యాటర్‌గా నా కెరీర్‌ను మ్యాచులను ఫినిష్ చేసే స్థాయికి తీసుకెళ్లా. నేను మంచి ఫినిషర్ అని భావిస్తా. ఆ విషయంలో గర్వంగా ఫీలవుతా. కానీ, ఇప్పటికీ నేర్చుకోవడం మాత్రం ఆపలేదు. సుదీర్ఘకాలం కెరీర్‌ను కొనసాగించాలంటే మాత్రం తప్పిదాల నుంచి నేర్చుకోవాలి. ఛేజింగ్‌లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా. అలాంటి సవాళ్లను ఇష్టపడతా" అని మిల్లర్ వెల్లడించాడు.

37 ఏళ్ల డేవిడ్ మిల్లర్ 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఇప్పటి వరకు 178 వన్డేల్లో 4,611 పరుగులు, 140 టీ20ల్లో 2,806 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో 152 మ్యాచులు ఆడిన మిల్లర్ 3,288 రన్స్ రాబట్టాడు. మిడిలార్డర్‌లో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడటంలో గుర్తింపు సాధించాడు. అయితే, అతడి కెరీర్‌లో ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం.

# అర టన్ను కొకైన్ సీజ్.. ప్యాకెట్లపై ఫుట్‌బాల్ స్టార్ ఫొటోలు..!




ఈక్వెడార్‌లో భారీ మొత్తంలో డ్రగ్స్‌ను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 470 కేజీల నుంచి 500 కేజీల వరకూ కొకైన్‌ను పట్టుకున్న పోలీసులు.. సరకును తరలిస్తున్న వాహనాన్ని జప్తు చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ కొకైన్ ప్యాకెట్లపై నార్వే ఫుట్‌బాల్ స్టార్ ఆటగాడు ఇర్లింగ్ హాలాండ్ ఫొటోలు ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసుల నుంచి ఎలాంటి వివరణ రాలేదు. డ్రగ్స్ విలువ దాదాపు రూ. 110 కోట్ల వరకూ ఉండొచ్చని అంచనా. ఈక్వెడార్‌లో డ్రగ్స్‌ను తరలించడం, అందుకోసం స్మగ్లర్లు ఎక్కువగా క్రీడాకారులు, సెలబ్రిటీల ఫొటోలను వినియోగించడం సర్వసాధారణమైన విషయమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్లేయర్ లేదా సెలబ్రిటీ చిత్రాన్ని బట్టి.. సదరు క్లయింట్‌కు స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఎలాంటి డ్రగ్‌ను పంపిస్తున్నారన్నది ఈజీగా తెలిసిపోతుంది. తాజాగా యాంటీ నార్కోటిక్స్ బృందాలు చేసిన దాడుల్లో ట్రక్ అడుగు భాగాన దాదాపు 370 బాక్స్‌లను కనిపెట్టి స్వాధీనం చేసుకున్నాయి. కేవలం హాలాండ్ మాత్రమే కాదు.. గతంలో అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సి బొమ్మలను కూడా స్మగ్లర్లు వినియోగించిన దాఖలాలు ఉన్నాయి.

# గంభీర్ ముక్కుసూటి మనిషి.. అందుకే నచ్చడం లేదేమో: హర్భజన్ సింగ్



టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై వస్తోన్న విమర్శలను మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఖండించారు. ఏదైనా మ్యాచ్ లేదా సిరీస్ ఓడిపోతే వెంటనే కోచ్‌పైనే విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషి అని ప్రశంసించాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి నచ్చడం లేదేమోనని హర్భజన్ వ్యాఖ్యానించాడు. గంభీర్ కోచింగ్‌లో మన జట్టు ఐసీసీ టోర్నీలను గెలిచిన విషయాన్ని గుర్తు చేశాడు.

"గంభీర్ ఎందుకు ఇంతలా విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే వెంటనే కోచ్‌ను నిందించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. అతడు క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచీ నాకు తెలుసు. ఆటపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ తొలినాళ్లలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతడికి మంచి స్నేహితులు. ఇప్పటికీ వారే ఫ్రెండ్స్ అనుకుంటా. అతడు ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడతాడు. అందుకే అతడి నిర్ణయాలు కొందరికి మింగుడుపడవు. కవర్ చూసి పుస్తకాన్ని ఎలాంటిదో నిర్ణయించకూడదని పెద్దలు అంటారు. పైకి అలా ఉండే గంభీర్‌ను విమర్శించడమూ తప్పే. విజయం కోసమే ఆడాలి అని బలంగా నమ్మే కోచ్ అతడు. ఓటమిని కనీసం ఊహించడానికి కూడా ఇష్టపడడు. డ్రా కోసం వెళ్లేందుకూ సుముఖత వ్యక్తం చేయడు" అని హర్భజన్ తెలిపాడు.

శుభ్‌మన్ సక్సెస్ వెనుక..

"ఎవరికైనా సరే సక్సెస్ ఒక్కసారిగా వచ్చేయదు. శుభ్‌మన్ గిల్ విషయంలోనూ అంతే. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అతడి కెప్టెన్సీని చూశాం. అతడి సత్తా మనందరికి తెలిసింది. బ్యాటర్‌గా పరుగులు రాబట్టాడు. సారథిగా జట్టును బాగా నడిపించాడు. ప్రతి ప్లేయర్ కెరీర్‌లో ఒడుదొడుకులు సహజమే. గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. వ్యక్తిగతంగానూ అతడు చాలా అద్భుతం" అని హర్భజన్ ప్రశంసించాడు. పరుగులు చేస్తున్నారుగా.. "లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఫుట్‌బాల్ ఆడుతున్నారు. మరి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగితే తప్పేంటి? ఏ ప్లేయర్‌కైనా సరే ప్రదర్శనే గీటురాయి. వయసు ముఖ్యం కాదు. విరాట్ వయసు 37 ఏళ్లు దాటినా.. ఇరవై ఏళ్ల కుర్రాడిలా మైదానంలో హుషారుగా ఉంటాడు. మెస్సిని ఆపాలంటే ఇప్పటికీ ఐదుగురు ప్లేయర్లు కష్టపడాలి. భారత జట్టులో ఫిట్‌నెస్‌కు సంబంధించి మార్పులు తీసుకొచ్చింది కోహ్లీనే. చివరి రోజు 400 పరుగులు లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. ఒకవేళ ఇప్పుడు ఓటమి ఎదురైనా ఏదొక రోజు సాధించి తీరుతామని చెప్పేవాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు మనందరికీ తెలుసు. కానీ, విరాట్ - రోహిత్ కు అనుభవం ఉంది. వీరిద్దరు ఇప్పుడు ఎలా ఆడుతున్నారనేదే ముఖ్యం. ఇటీవల మ్యాచుల్లో ప్రదర్శన చూస్తే వీరిద్దరూ సఫలమైనట్లే" అని హర్భజన్ వెల్లడించాడు.

# భారత్‌తో టీ20 సిరీస్.. షెడ్యూల్ మార్చాలనుకుంటున్న అఫ్గానిస్థాన్!

సెప్టెంబరులో అఫ్గానిస్థాన్, భారత్ మధ్య జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు జరిగే అవకాశముంది. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియమే వేదికగా సెప్టెంబరు 13, 15, 17వ తేదీల్లో టీ20 మ్యాచ్‌లు జరుగుతాయని బీసీసీఐ, అఫ్గానిస్థాన్ క్రికెట్ బుధవారం బోర్డు సంయుక్త ప్రకటన చేశాయి. తమ దేశంలో అస్థిర పరిస్థితుల కారణంగా చాలా కాలంగా హోమ్ సిరీస్‌లను భారత్ కేంద్రంగా ఆడుతోన్న అఫ్గాన్.. భారత్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ క్రమంలో గురువారం ఓ వార్త బయటికొచ్చింది. ఆతిథ్య దేశంగా ఉన్న అఫ్గాన్ సిరీస్ షెడ్యూల్‌ను మార్చాలని యోచిస్తోందని సమాచారం. షెడ్యూల్‌లో మార్పులు చేసి మొదటి లేదా రెండో టీ20ని సెప్టెంబరు 14న (వినాయక చవితి) నిర్వహించాలని భావిస్తోందట. ఆ రోజు సోమవారం అయినప్పటికీ పండగ సెలవు దినం కావడంతో మ్యాచ్‌ను వీక్షించడానికి స్టేడియానికి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో వస్తారని అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఆశిస్తోంది. మ్యాచ్‌కు టీవీ, డిజిటల్ వీక్షణలు కూడా పెరిగే ఛాన్స్ ఉండటంతో ఈ ఆలోచన చేస్తోందట. ఈ విషయాన్ని ఇప్పటికే అఫ్గాన్.. బీసీసీఐ దృష్టికి తీసుకువెళ్లిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ ప్రతిపాదనకు బీసీసీఐ అంగీకరిస్తేనే షెడ్యూల్‌లో మార్పులు జరుగుతాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314